IYYALATELANGANA
ఇయ్యాల తెలంగాణ
మన భాష – మన యాస
iyyalatelangana.com facebook.com/iyyalatelangana twitter.com/iyyalatelangana printerest./iyyalatelangana
హైదరాబాద్ ఆదివారం 19-04-2026 సంపుటి :10 సంచిక :280 పేజీలు 8 వెల. రూ॥ 4 /-

# మహిళా రిజర్వేషన్‌లో చిత్తశుద్ధి లేదు

బిల్లు ముసుగులో డీలిమిటేషన్ చట్టం
దక్షిణాదిని దెబ్బతీసే కుట్రను అడ్డుకున్నాం
చిత్తుశద్ది ఉంటే కేవలం మహిళా బిల్లు తేవాలి
అందుకు ఇండి కూటమి బేషరతుగా మద్దతు ఇస్తుంది
బిజెపితో జతకట్టిన పార్టీలకు ఎదరుదెబ్బలు తప్పవ్వు
తెలుగు దేశం పార్టీకి కూడా ఆ ప్రమాదం ఉంది
మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి



న్యూఢిల్లీ,ఏప్రిల్18( మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చారని కేంద్ర ప్రభుత్వంపై తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు గుప్పించారు. మహిళా బిల్లు వీగిపోవడంతో ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని పేర్కొన్నారు. మహిళా బిల్లు వీగిపోవడం.. భాజపా విధానాల ఓటమిగా భావించాలి. ఈ బిల్లుపై ప్రధాని మోదీకి నిజాయతీ లేదు. నిజాయతీగా మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువస్తే.. పార్లమెంట్‌లో అందరూ మద్దతు తెలిపేవారని అన్నారు. అయితే మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ బిల్లు తీసుకువచ్చి దక్షిణాదికి అన్యాయం చేయాలని చూశారు. ప్రధాని మోదీ.. ఉత్తర, దక్షిణ భారత్ మధ్య అంతరాలు సృష్టించే విధానాన్ని విరమించుకోవాలన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుపై మాకు చిత్తశుద్ధి ఉంది. 2023 నాటి మహిళా బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి. ఆ బిల్లు పెడితే మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. ఇందులోనూ ఎస్సీ, ఎస్టీ ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. మహిళా రిజర్వేషన్ల బిల్లు విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని సీఎం రేవంత్ అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ నిజాయితీగా తీసుకురాలేదని రేవంత్ రెడ్డి అన్నారు. మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చేందుకు బీజేపీ కుట్ర చేసిందని.. దక్షిణాదికి జరిగే అన్యాయాన్ని లోక్ సభ సాక్షిగా అడ్డుకున్నామని పేర్కొన్నారు. విపక్షాల ఐక్యతతో మోదీ సర్కార్ ఓడిపోయిందన్నారు. ఇది రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాల ఓటమి అంటూ వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు ఇప్పటికే పాసైందని.. చిన్న సవరణలతో రిజర్వేషన్లు అమలు చేయవచ్చని రేవంత్ అన్నారు. రిజర్వేషన్లు తొలగించేందుకే బీజేపీ కుట్ర చేసిందని.. బీజేపీకి 400 సీట్లు వచ్చి ఉంటే రాజ్యాంగాన్ని మార్చేవారని తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాలపై బురద జల్లేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. 2023 మహిళా బిల్లును యథాతథంగా అమలు చేయాలని బీజేపీకి సూచించారు. అలా చేస్తే ఇండి కూటమి ఏకగ్రీవంగా మద్దతు ఇచ్చేందుకు సిద్ధమని ఆయన పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించి తీసుకువచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా రేవంత్ హామీ ఇచ్చారు. మహిళా రిజర్వేషన్లపై తమకు చిత్తశుద్ధి ఉందని, యూపీ ఎన్నికల్లోపు వాటిని అమలు చేయాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. దీంతో ప్రజల్లో ఎవరికి మద్దతు ఉందో ప్రజాక్షేత్రంలోనే తేలుతుందని రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. బిల్లును అడ్డుకోకుంటే డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసేవారని ధ్వజమెత్తారు. నార్త్, సౌత్ మధ్య అంతరాలు పెట్టే విధానం ఇకనైనా మార్చుకో వాలని బీజేపీకి సీఎం రేవంత్ రెడ్డి హితవుపలికారు. ఇకపోతే బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీల మనగడ భవిష్యత్తులో కష్టంగా ఉంటుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తెలుగుదేశం, చంద్రబాబు నాయుడు పరిస్థితి కూడా అలాగే అవుతుందని పేర్కొన్నారు. నితీశ్ కుమార్, ఏక్ నాథ్ షిండేలా పరిస్థితి మనం ఇప్పుడు చూస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం బీజేపీకి కేంద్రంలో సీట్లు తక్కువగా ఉన్నాయి కాబట్టి టీడీపీకి ఇంపార్టెన్స్ ఇస్తోందని పేర్కొన్నారు. లోక్‌సభ, రాజ్యసభ ఉన్నది చట్టాలు చేయడానికి మాత్రమేనని చెప్పుకొచ్చారు. వాటిని ఇంప్లిమెంట్ చేసేది స్థానికంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు అధికార యంత్రాంగమని తెలిపారు. 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన అన్నింటిని చట్టాలు చేయలేమని పేర్కొన్నారు. కేంద్రంలో మెజార్టీ ఉందని ప్రధానిగా ఉన్న ఎవరైనా తనకు తనకు రాజుగా 2/ 3 మెజార్టీతో చట్టం చేసుకుంటే ఒప్పుకోరు కదా అని ప్రశ్నించారు. డిక్టేటర్‌షిప్‌ని ఎవరు ఒప్పుకోరని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షానికి కేవలం 11 సీట్లే ఉన్నాయని తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు.

## మహిళలకు విపక్షాలు వ్యతిరేకం

బిల్లును అడ్డుకుని పెద్ద తప్పు చేశాయి
ఊరూరా ఈ విషయం ప్రచారం చేయండి
కేబినేట్ భేటీలో ప్రధాని మోడీ సూచన
కేంద్ర ఉద్యోగులకు 2శాతం డిఎ పెంపు
13వేల కోట్లతో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటు



న్యూఢిల్లీ,ఏప్రిల్18(: మహిళా రిజర్వేషన్ల కోసం తెచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోవడంపై ప్రధాని మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ విషయంలో విపక్షాలు జీవితాంతం చింతిస్తాయన్నారు. ప్రధాని అధ్యక్షతన దిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు మద్దతు ఇవ్వకుండా ప్రతిపక్ష పార్టీలు పెద్ద తప్పు చేశాయని ప్రధాని మోదీ అన్నారు. ఇందుకు వారు భారీ మూల్యం చెల్లించుకుంటాయని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకోవడానికి సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు మహిళలకు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరేలా తెలియజేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. అయితే, 298-230 ఓట్ల తేడాతో ఇది వీగిపోయింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కరవు భత్యం (డీఏ) 2 శాతం పెంచడానికి నిర్ణయం తీసుకుంది. దీనికి కేంద్ర క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది. దాంతో ఉద్యోగుల నుంచి ఆందోళన వ్యక్తమైంది. అలాగే ఈ క్యాబినెట్ సమావేశంలో సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.13వేల కోట్లు కేటాయించనున్నారు. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం.

## మహిళా బిల్లును అడ్డుకోవడం దురదృష్టకరం

సమాధానం చెప్పుకోలేని స్థితిలో విపక్షాలు
కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శలు



న్యూఢిల్లీ,ఏప్రిల్18(: నియోజకవర్గాల పునర్విభన బిల్లు, మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంట్‌లో వీగిపోవడం దురదృష్టకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ బిల్లులను అడ్డుకోవడం చారిత్రాత్మక తప్పిదమని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు చరిత్రలో మహిళా ద్రోహులుగా మిగిలిపోతాయని విమర్శించారు. శనివారం ఢిల్లీలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ బిల్లులను ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ప్రజలకు ఇండియా కూటమి నేతలు చెప్పలేకపోయారని పేర్కొన్నారు. మహిళలకు కాంగ్రెస్ పార్టీ మరోసారి అన్యాయం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. 50 శాతం సీట్లు పెంచాల్సిన అవసరం ఉందని చెప్పామని, ఈ విషయంపై అన్ని పార్టీలతో తాము మాట్లాడామని కిషన్‌రెడ్డి ప్రస్తావించారు. లోక్‌సభలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి వాళ్లకు తెలియజేసే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ బిల్లులపై కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదని చెప్పిందని అన్నారు.

## రెండోవిడత రైతుభరోసా విడుదలకు సిద్ధం

20న కాటారాం సభలో విడుదల చేయనున్న రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్18): తెలంగాణ రైతులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'రైతు భరోసా'పథకం రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయం అందనుంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు సంక్షేమవే ధ్యేయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వానాకాలం సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో రైతు భరోసా నిధులు విడుదల చేయాలని సీఎం నిర్ణయించారు. భూపాలపల్లి జిల్లా కాటారంలో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు. బటన్ నొక్కి నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి నగదును జమ చేయనున్నారు. రెండో విడత నిధుల విడుదల ద్వారా రాష్ట్రంలోని మెజారిటీ రైతులకు లబ్ది చేకూరనుంది. ప్రతి ఎకరానికి రూ. 6,000 చొప్పున పెట్టుబడి సాయం అందనుంది. ఈ విడతలో 45,11,947 మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.50 కోట్ల ఎకరాలకు ఈ సాయం వర్తించనుంది. ప్రభుత్వం రైతు భరోసా కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. దీనికి సంబంధించిన గణాంకాలు కింది విధంగా ఉన్నాయి. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3,590 కోట్లను రైతుల ఖాతాల్లో సక్సెస్‌ఫుల్‌గా జమ చేసింది. 20వ తేదీన రూ. 5,653 కోట్లు జమ కానున్నాయి. మొత్తం 73 లక్షల మంది రైతులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. మిగిలిన రైతుల కోసం మూడో విడత నిధులను విడుదల చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది.విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే సమయంలో ఈ నగదు అందడం వల్ల రైతన్నలకు వడ్డీ వ్యాపారుల భారం తప్పుతుంది. నిధులు సకాలంలో అందడం వల్ల అన్నదాతలు సాగు పనులను వేగవంతం చేసే అవకాశం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చే క్రమంలో రైతు భరోసా నిధుల విడుదలకు ప్రాధాన్యం ఇస్తోంది. కాటారం సభ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యవసాయ రంగంలో కొత్త ఉత్సాహాన్ని నింపనుంది.

## మహిళా బిల్లు పేరుతో డీలిమిటేషన్ కుట్ర

డీలిమిటేషన్‌తో తమిళనాడు ప్రాధాన్యం తగ్గింపు
అందుకే రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకున్నాం
తమిళనాడు ఎన్నికల ప్రచారంలో రాహుల్

చెన్నై,ఏప్రిల్18(: మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోవడంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పందించారు. మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన దాగి ఉందని, రిజర్వేషన్ల పేరుతో పునర్విభజన బిల్లును ఆమోదించుకోవాలని కేంద్రం చూసిందని అన్నారు. ఈ డీలిమిటేషన్ బిల్లుతో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గిపోతుందని చెప్పారు. అందుకే దానిని అడ్డుకున్నామని అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా తిరువళ్లూరు జిల్లా పొన్నేరిలో జరిగిన ర్యాలీలో రాహుల్ శనివారంనాడు పాల్గొన్నారు. తమిళ భాష, సంస్కృతిని దెబ్బతీసేందుకు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ గత కొన్నేళ్లుగా ప్రయత్నిస్తున్నాయని రాహుల్ విమర్శించారు. తమిళనాడుతో తనకున్న అనుబంధాన్ని వివరిస్తూ 'చాలా ఏళ్లుగా తమిళనాడు ప్రజలతో నాకు అనుబంధం ఉంది. నేను తమిళనాడులో పుట్టలేదు. నా కుటుంబం కూడా తమిళనాడు నుంచి వచ్చినది కాదు. అయినప్పటికీ ఇది నా సొంతిల్లులా అనిపిస్తుంది. తమిళ భాష, సంస్కృతిపై ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ దాడికి ప్రయత్నిస్తున్నాయి. వీళ్లకెంత ధైర్యం అని నాకు అపిస్తుంటుంది' అని రాహుల్ అన్నారు. పార్లమెంటులో పరిణామాలపై మాట్లాడుతూ, కొత్త బిల్లు పేరుతో వాళ్లు పార్లమెంటు ముందుకు వచ్చారని, దానిని మహిళా బిల్లు అని చెబుతున్నారని, అయితే మహిళా బిల్లును 2023లోనే ఆమోదించడం జరిగిందని తెలిపారు. బిల్లు వెనుక అసలు ఉద్దేశం నియోజకవర్గాల పునర్విభజనేనని అన్నారు. పార్లమెంటులో తమిళనాడుకు ప్రాతినిధ్యం తగ్గించడం, దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలను బలహీనపరచడం బిల్లు ఉద్దేశమని, అందువల్లే ఆ బిల్లును తాము ఓడించామని చెప్పారు. భారతదేశం రాష్ట్రాల యూనియన్ అనీ, అన్ని రాష్ట్రాల ను సమానంగా చూడాలని, కేంద్రంలో ప్రతి రాష్ట్రానికి మాట్లాడే అవకాశం, భాష, సంప్రదాయాలను స్వేచ్ఛగా ప్రకటించుకునే వీలుండాలని అన్నారు. బీజేపీ పాలనా విధానం ఇందుకు భిన్నంగా ఉందని, ప్రధానమంత్రి ఒకే దేశం, ఒకే నేత, ఒకే భాష, ఒకే ప్రజ అంటూ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని విమర్శించారు. కేంద్రం గుత్తాధిపత్యాన్ని తమ కూటమి అడ్డుకుంటుందని చెప్పారు. ఢిల్లీ నుంచి తమిళనాడును శాసించాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ అనుకుంటున్నాయని రాహుల్ విమర్శించారు. అయితే ఇందుకు తాము ఎంతమాత్రం అనుమతించేది లేదన్నారు.

## తెలంగాణలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత
నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు
ఏప్రిల్‌లో మరింత పెరిగే అవకాశం

హైదరాబాద్,ఏప్రిల్18(:తెలంగాణలో రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటికి ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఏప్రిల్ తెలంగాణలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం నుంచే భానుడు భగభగమంటున్నాడు. వివిధ పనుల కోసం బయటకు వెళ్లిన ప్రజలు ఎండవేడిమి తట్టుకోలేక ఆపసోపాలు పడుతున్నారు. శనివారం కుమురంభీం జిల్లా కెరిమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నిజామాబాద్ జిల్లా మెండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దని వాతావరణ శాఖ సూచించింది.ఉదయం నుంచే ఎండ తీవ్రత విపీతరంగా ఉంటోంది. ఉక్కపోత వాతావరణం పెరిగి రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు తగ్గడం లేదు. మార్చి చివరి నుంచి సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో కొన్ని ప్రాంతాల్లో వర్షాల వల్ల కొంత ఉపశమనం లభించినప్పటికీ, ఎండలు మళ్లీ తీవ్రరూపం దాల్చాయి. ప్రస్తుతం సాధారణం కంటే 3 డిగ్రీల వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ పరిస్థితులకు ప్రధాన కారణంగా ఎల్ నినో ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు 0.5 నుంచి 1 డిగ్రీ పెరగడంతో ఎల్ నినో ప్రభావం ఏర్పడి, దక్షిణ భారతదేశంపై ఎండల ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ వెల్లడించింది.

IYYALATELANGANA
ఇయ్యాల తెలంగాణ
మన భాష – మన యాస

# సంపాదకీయం

## అదను చూసి దెబ్బకొట్టిన విపక్షాలు

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రతిపాదించిన 50 శాతం సీట్ల పెంపు బిల్లు వీగిపోయింది. అయితే ఈ సూత్రం ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ మేధోమథనానికి దారితీసింది. బిల్లు చారిత్రాత్మకం.. దేశంలో ఉన్న మహిళలకు లభిస్తున్న గౌరవం.. ఇకపై వారు మరింత సాధికారత సాధించవచ్చు. చట్టసభల్లో మరింత సమున్నతంగా కొనసాగవచ్చు.. భారత మహిళలు మరింత అభివృద్ధి చెందుతారని ఆశిస్తున్నాం.. ఇదీ మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టసభల్లోకి వచ్చే ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ మహిళలను ఉద్దేశించి రాసిన లేఖ. ఈ బిల్లు చర్చకు వచ్చే ముందు పార్లమెంట్లో విస్తృత సమావేశం జరిగింది. అధికార పక్షం నుంచి మొదలు పెడితే ప్రతిపక్షం వరకు నాయకులు తమ తమ వాణి వినిపించారు.. దీంతో చట్టసభల్లో మహిళ బిల్లు నెగ్గుతుందని.. మహిళలకు రిజర్వేషన్ వర్తిస్తుందని అందరూ అనుకున్నారు. కానీ చారిత్రాత్మకమైన బిల్లు వీగిపోయింది. విపక్షాల ఐక్యత ముందు నరేంద్ర మోడీ ప్రభుత్వం తలవంచింది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. విపక్షాల ఐక్యత ముందు తలవంచక తప్పలేదుఈ బిల్లు ఆమోదానికి మూడింట రెండు వంతుల మెజారిటీ కావాలి. ఆ మెజారిటీని కూడగట్టడంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం విఫలమైంది. దశాబ్దాలపాటు నెరవేరని కలగా ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లు సహకారం కాలేదు.. శుక్రవారం పార్లమెంట్లో ఉత్కంఠ భరితమైన వాతావరణం మధ్య.. ఈ బిల్లుపై ఓటింగ్ నిర్వహించారు. సభకు మొత్తం 528 మంది హాజరయ్యారు. అనుకూలంగా 298 మంది మాత్రమే ఓటు వేశారు. మిగతా 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి నోచుకోవాలంటే కనీసం 352 మంది సభ్యులు ఆమోదం తెలపాలి. మ్యాజిక్ ఫిగర్ పొందడానికి 54 ఓట్లు అవసరం. అయితే వారంతా వ్యతిరేకంగా ఓటు వేయడంతో బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. దీంతో బిల్లును తిరస్కరించామని స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. సభను మరునటి రోజుకు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు. మొదటినుంచి కూడా డీలిమిటేషన్ చేపట్టాలని నిబంధన పై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ అమలుకు ముందు దీనిని చేపట్టాలనే ప్రభుత్వ నిబంధన పై మండిపడుతున్నాయి.. "ఇప్పుడు మీరెందుకు రిజర్వేషన్ అమలు చేయడం లేదు? భవిష్యత్ కాలంలో నిర్వహించే డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇది మహిళలకు గర్వభంగాన్ని కలిగించే అంశమని" విపక్షాలు కేంద్రంపై మండిపడుతున్నాయి. అంతేకాదు కీలకమైన ఓటింగ్ సమయంలో విపక్షాలు మొత్తం ఏకతాటిపైకి వచ్చాయి. అంతేకాదు, మిత్రపక్షాలను కూడా కేంద్రం ఒప్పించలేకపోవడం నరేంద్ర మోడీ వైఫల్యానికి నిదర్శనం అని విశ్లేషకులు అంటున్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోయిన తర్వాత.. కేంద్రం వెంటనే అప్రమత్తమైంది. మహిళా రిజర్వేషన్లతో సంబంధం ఉన్న డీ లిమిటేషన్ బిల్లు 2026, కేంద్ర పాలిత ప్రాంతాలకు సంబంధించిన చట్టాల సవరణ బిల్లులు మొత్తం వెనక్కి తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి ప్రకటించడం విశేషం. వాస్తవానికి బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవడం ఒకరకంగా బలహీనతను నిరూపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. విపక్షాలు ఎన్నడూ లేనంతగా ఐక్యతను ప్రదర్శిస్తున్నాయి. దీనిని పసిగట్టడంలో అధికార పక్షం విఫలమైంది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు అమలవుతాయా.. ఇంకా కొంతకాలం ఇలానే ఉంటుందా.. అనే సందిగ్ధం కొనసాగుతూనే ఉంది. కాకపోతే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు నోచుకోకపోవడంతో.. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా మహిళల ప్రభావం ఎన్నికల మీద పడుతుందని తెలుస్తోంది. అయితే మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పటితోనే కేంద్రం నిలిపి వేస్తుందా.. ఎన్నికలకు ముందు కొత్త సొంతం ముందుకు వస్తుందా.. విపక్షాల ఒత్తిడికి తలవంచుతుందా.. డీలిమిటేషన్ నిబంధన తొలగించి.. తాజాగా కొత్త బిల్లు ప్రవేశపెడుతుందా.. ఈ ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం లభించాల్సి ఉంది. జనాభా ప్రాతిపదికన మాత్రమే పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం దారుణంగా పడిపోతుందన్న ఆందోళనలతో కేంద్రం ప్రతిపాదించిన ఈ ప్రోరాటా పద్ధతి ఏ మేరకు సమన్యాయం చేకూరుస్తుందనే దానిపై విస్తృత చర్చలు జరుగుతున్నాయి. అమిత్ షా ప్రతిపాదించిన ఫార్ములాలోని ప్రధానాంశం ఏమిటంటే.. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను కచ్చితంగా 50 శాతం మేర పెంచడం. దీనివల్ల రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న ప్రాతినిధ్య నిష్పత్తి ఏమాత్రం మారదు. ఉదాహరణకు, లోక్‌సభలో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా సుమారు 24 శాతంగా ఉంది. అన్ని రాష్ట్రాల్లోనూ సీట్లు 50 శాతం పెరిగినప్పుడు, మొత్తం సీట్ల సంఖ్య పెరిగినా దక్షిణాది రాష్ట్రాల వాటా అదే 24 శాతంగా కొనసాగుతుంది. తద్వారా జనాభా నియంత్రణ పాటించినందుకు ఏ రాష్ట్రమూ తన రాజకీయ బలాన్ని కోల్పోదని కేంద్రం భరోసా ఇస్తోంది. ఈ ప్రోరాటా పద్ధతి ఒక మధ్యేమార్గం . కేవలం 2021/2026 జనాభా లెక్కల ఆధారంగా సీట్లు కేటాయిస్తే, ఉత్తరాది రాష్ట్రాల సీట్లు భారీగా పెరిగి, దక్షిణాది ప్రాబల్యం 18-20 శాతానికి పడిపోయే ప్రమాదం ఉంది. కానీ, ఈ 50 శాతం పెంపుదల సూత్రం వల్ల ఉత్తరప్రదేశ్ లేదా బీహార్ వంటి రాష్ట్రాలకు అదనపు ప్రయోజనం కలగదు, అలాగే కేరళ లేదా తమిళనాడు వంటి రాష్ట్రాలకు నష్టం వాటిల్లదు. అంటే, పార్లమెంటులో ఒక బిల్లును ఆమోదించుకోవడానికి అవసరమైన ఓట్ల శాతంలో దక్షిణాది రాష్ట్రాల బలం యధాతథంగా ఉంటుంది.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్–



హైదరాబాద్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నగరం నలుమూలలా ఇప్పుడు ఆకాశహర్మ్యాలే కనిపిస్తున్నాయి. అపరిమితమైన ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ సౌలభ్యంతో బిల్డర్లు 40-50 అంతస్తుల మేర భవనాలను నిర్మిస్తున్నారు. అయితే, పైకి చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ భవనాల వెనుక ధరలు, అయోమయ మౌలిక వసతులు దాగున్నాయనే చర్చ మొదలైంది. హైదరాబాద్‌లో రూ. 2 కోట్ల పైబడిన ఫ్లాట్ల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ ఈ ధరలకు కేంద్రబిందువుగా మారింది. అయితే కొత్త లాంచ్‌లలో ఉన్న జోరు రీసేల్ మార్కెట్‌లో లేకపోవడం, మౌలిక సదుపాయాల కొరత వంటివి ఇన్వెస్టర్లను, గృహ కొనుగోలుదారులను కలవరపెడుతున్నాయి. 2026 మొదటి త్రైమాసికంలో కొత్త ప్రాజెక్టుల లాంచ్‌లు ఏకంగా 46శాతం పడిపోవడం మార్కెట్ మందగమనానికి సంకేతంగా కనిపిస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా, ముఖ్యంగా రెడిట్ వంటి ప్లాట్‌ఫారమ్స్‌లో నెటిజన్లు లేవనెత్తుతున్న ప్రశ్నలు ఇన్వెస్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. "హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో చదరపు అడుగుకు రూ. 8,000 నుంచి రూ. 12,000 వసూలు చేస్తున్నారు. కానీ, వర్షం వస్తే ఆ రోడ్లపై నడవగలమా?

### నిలిచిపోయిన రిటర్న్స్.. రీసేల్ మార్కెట్ వెలవెల!

డ్రైనేజీ వ్యవస్థ ఉందా? కనీసం తాగునీటి సరఫరా ఉందా?" అని కొనుగోలుదారులు నిలదీస్తున్నారు. పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్‌లో సుమారు 20,000కు పైగా లగ్జరీ యూనిట్లు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్నాయి. ఈ భారీ భవనాల్లో వేల సంఖ్యలో కుటుంబాలు చేరితే, ఇప్పటికే ఊపిరాడని ట్రాఫిక్‌తో సతమతమవుతున్న ఆ ప్రాంత మౌలిక వసతులు ఆ భారాన్ని మోయగలవా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. సరైన రోడ్లు, డ్రైనేజీ లేని చోట రూ. 2 కోట్లు పోసి ఫ్లాట్ కొనడం 'లగ్జరీ' అనిపించుకుంటుందా లేక 'నరకం' అవుతుందా అని నెటిజన్లు చర్చించుకుంటున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఎప్పుడైనా రీసేల్ మార్కెట్ బలంగా ఉంటేనే ఆ రంగం ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క అని నిపుణులు చెబుతుంటారు. కానీ హైదరాబాద్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది.: మూడేళ్ల క్రితం ఒక కోటి రూపాయలు పెట్టి కొన్న ఫ్లాట్, ఈరోజు అమ్మాలంటే కొనేవారే లేరు! ఒకవేళ ఉన్నా, కొన్న ధరకే అడగడం లేదా అంతకంటే తక్కువకు బేరం చేయడం ఇన్వెస్టర్లను ఆందోళనకు గురిచేస్తోంది. బ్యాంకు వడ్డీలు కలుపుకుంటే, మూడేళ్ల తర్వాత ఆ ఆస్తి విలువ పెరగకపోగా, ఇన్వెస్టర్లు నికరంగా నష్టపోతున్నారు. "మా స్నేహితుడు పెట్టుబడి కోసం లగ్జరీ అపార్ట్‌మెంట్ కొన్నాడు, ఇప్పుడు బయటపడలేకపోతున్నాడు,'' అని ఒక బాధితుడు పేర్కొన్నాడు. నివాస యోగ్యం కాని ప్రాంతాలు: భారీ నిర్మాణాల వల్ల వచ్చే దుమ్ము, తక్కువ జనాభా వంటి కారణాలతో కొత్త కమ్యూనిటీలు కేవలం పేరుకే 'హైటెక్'గా మిగిలిపోతున్నాయని, పాత నగరంలో ఉన్న సౌకర్యం, అనుబంధం ఇక్కడ లేవని కొందరు అభిప్రాయపడుతున్నారు. హైదరాబాద్? రియల్? ఎస్టేట్– అసలు ఈ డిమాండ్‌ను నడిపిస్తోంది ఎవరు? ధరలు ఇంతలా ఉన్నా, కొత్త లాంచ్‌లలో బుకింగ్స్ జరుగుతున్నాయని బిల్డర్లు చెబుతున్నారు. దీని వెనుక ప్రధానంగా మూడు శక్తులు ఉన్నాయి: ఐటీ రంగంలోని సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు, భారీగా ఈ-సాప్స్ పొందిన టెక్కీలు ఆఫీసులకు దగ్గరగా ఉండాలనే ఉద్దేశంతో ఈ భారీ ధరలకు వెనకాడటం లేదు.: డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం ప్రవాస భారతీయులకు కలిసి వస్తోంది. వారు హైదరాబాద్‌ను ఒక సురక్షితమైన ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గా చూస్తున్నారు.: తెలంగాణలో భూముల ధరలు పెరగడంతో, తమ ఊర్లలో భూములు అమ్మిన వారు ఆ డబ్బును నగరంలోని లగ్జరీ ఫ్లాట్లపై పెడుతున్నారు.: బిల్డర్లు ఎక్కువ అంతస్తులు కట్టే అవకాశం ఉండటంతో క్లబ్‌హౌస్‌లు, గ్రీన్ స్పేస్‌లు వంటి సౌకర్యాలతో ప్రాజెక్టులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. 2026 మొదటి త్రైమాసికం: ఒక హెచ్చరిక! నో్బ్రోకర్ నివేదిక ప్రకారం, 2026 క్యూ1లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ భారీ కరెక్షన్‌ను చూసింది. నివాస గృహాల లాంచ్‌లు ఏకంగా 46% పడిపోయాయి. గతంలో నెలకు వేల సంఖ్యలో కొత్త యూనిట్లు మార్కెట్?లోకి వచ్చేవి, కానీ మార్చి నెలలో కొత్త సరఫరా దాదాపు శూన్యం. హైదరాబాద్‌లో 80శాతం కంటే ఎక్కువ ఫ్లాట్లు 3బీహెచ్?కే లేదా అంతకంటే పెద్దవి మాత్రమే ఉంటున్నాయి. సగటు ఫ్లాట్ సైజు 2,050 చదరపు అడుగులుగా ఉంది. సామాన్య మధ్యతరగతి వ్యక్తికి అవసరమైన 2బీహెచ్?కే లేదా చిన్న ఫ్లాట్లు మార్కెట్ నుంచి మాయమైపోతున్నాయి. దీనివల్ల దాదాపు 84% మంది కొనుగోలుదారులు "అఫర్డబిలిటీ స్ట్రెయిన్'' (ధర భరించలేకపోవడం) ఎదుర్కొంటున్నారు. హైదరాబాద్? రియల్? ఎస్టేట్– భవిష్యత్తు ఏంటి? అపరిమిత ఎఫ్?ఎస్?ఐ అనేది ఒక వరంలా కనిపించినా, అది నిర్మాణ వ్యయాన్ని కూడా విపరీతంగా పెంచేస్తోంది. ఆకాశహర్మ్యాలు కట్టాలంటే కావాల్సిన ఇంజనీరింగ్ టెక్నాలజీ, సేఫ్టీ సిస్టమ్స్ వల్ల బిల్డర్లపై భారం పడుతోంది. అది తిరిగి కస్టమర్ల మీదనే పడుతోంది. మౌలిక వసతులు మెరుగుపడకుండా కేవలం భవనాలు మాత్రమే పెరిగితే, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ బబుల్ పేలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రేవంత్... నేషనల్ స్ట్రాటజిస్ట్..

హైదరాబాద్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)ఒకప్పుడు కాంగ్రెస్ అంటే ఢిల్లీ నుండి వచ్చే ఆదేశాల కోసం రాష్ట్ర నేతలు వేచి చూసే పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు సీన్ రివర్స్ అయ్యింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే సలహాలు, ఆయన రూపొందించే వ్యూహాలు ఇప్పుడు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కి దిక్సూచిగా మారుతున్నాయి. కేవలం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాత్రమే కాకుండా, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే వంటి అగ్రనేతలకు నమ్మకమైన 'నేషనల్ స్ట్రాటజిస్ట్'గా రేవంత్ రెడ్డి ఎదిగిన తీరు ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. రాజకీయాల్లో ప్రత్యర్థి వేసే ఎత్తుగడలకు ప్రతిస్పందించడం ఒక ఎత్తు అయితే, ప్రత్యర్థిని తన దారిలోకి తెచ్చుకోవడం మరో ఎత్తు. రేవంత్ రెడ్డి సరిగ్గా ఇదే చేస్తున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో "బీజేపీ గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తుంది" అనే నినాదాన్ని ఆయన క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లారు. ఈ ఒక్క వ్యూహం దేశవ్యాప్తంగా బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది. రాజ్యాంగ రక్షణ, సామాజిక న్యాయం వంటి అంశాలను కాంగ్రెస్ ప్రధాన ఎజెండాగా మార్చడంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, దూకుడుతో కూడిన ఎజెండాను సెట్ చేయడంలో ఆయన సఫలీకృతులయ్యారు. నియోజకవర్గాల పునర్విభజన అంశం ప్రస్తుతం ఉత్తరాది ? దక్షిణాది రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతోంది. జనాభా నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గుతాయన్న ఆందోళనలో రేవంత్ రెడ్డి ఒక 'హైబ్రిడ్ మోడల్'ను తెరపైకి తెచ్చారు. ఉత్తరాది రాష్ట్రాలకు కోపం రాకుండా, అదే సమయంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు గండి పడకుండా ఆయన ప్రతిపాదించిన ఈ వినూత్న ఫార్ములా ఇప్పుడు కాంగ్రెస్ అధికారిక విధానంగా మారుతోంది. సంక్లిష్టమైన సమస్యలకు సరళమైన, ఆమోదయోగ్యమైన పరిష్కారాలు చూపడం ద్వారా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఒక 'థింక్ ట్యాంక్'గా మారారు. రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణకే పరిమితం కాకుండా ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో 'స్టార్ క్యాంపెయినర్'గా దూసుకుపోతున్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపిక వంటి కీలక విషయాల్లో రేవంత్ చొరవ చూపడం ఆయన స్థాయికి నిదర్శనం. గతంలో అహ్మద్ పటేల్ వంటి నేతలు పోషించిన వ్యూహాత్మక పాత్రను రేవంత్ రెడ్డి భర్తీ చేస్తున్నారనే అభిప్రాయం పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. దక్షిణ భారతదేశంలో బీజేపీని నిలువరించాలంటే రేవంత్ లాంటి దూకుడున్న నేత అవసరమని ఏఐసీసీ గట్టిగా నమ్ముతోంది. ప్రస్తుతం రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో ఒక స్వర్ణయుగం నడుస్తోంది. అటు రాష్ట్రంలో తిరుగులేని నాయకుడిగా పాలన సాగిస్తూనే, ఇటు కేంద్రంలో మోదీ సర్కార్‌ను సూటిగా ప్రశ్నించే గొంతుకగా మారారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన కేవలం ఒక ముఖ్యమంత్రి మాత్రమే కాదు, రాబోయే రోజుల్లో జాతీయ రాజకీయాల్లో భారీ మార్పులకు శ్రీకారం చుట్టే ఒక బలమైన 'పొలిటికల్ అస్సెట్'. రేవంత్ రెడ్డి రూపొందిస్తున్న ఈ 'తెలంగాణ మోడల్' వ్యూహాలు రేపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పూర్వవైభవానికి పునాది వేస్తాయనడంలో సందేహం లేదు.



# కమలం గూటికి మల్లారెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో ఆయన ఒక సంచలనం. టీడీపీ నుంచి ఎంపీగా గెలిచారు. తర్వాత బీఆర్ఎస్‌లో చేరారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మంత్రిగా పనిచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. కానీ రేవంత్‌రెడ్డితో ఉన్న విభేదాల కారణంగా చేరిక జరగలేదు. ఇప్పటికే ఆయన ఎవరో అర్థమై ఉంటుంది కదూ.. హా ఆయనే.. పూలమ్మిన.. పాలమ్మిన.. స్కూల్ పెట్టిన.. కాలేజీలు పెట్టిన.. ఎంపీగ గెలిచిన.. ఎమ్మెల్యేగ గెలిచిన.. మంత్రి అయినా అంటూ తన వాక్చాతుర్యం, బాడీ లాంగ్వేజ్‌తో ఆకట్టుకునే మల్లారెడ్డి. ప్రస్తుతం అధికారంలో లేరు. దీంతో సైలెంట్ అయ్యారు. అయితే ఇటీవల ఆయన కోడలు, మల్లారెడ్డి విద్యాసంస్థల కో చైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి యాక్టివ్‌గా ఉంటున్నారు. ఇటు సోషల్ మీడియాలో, అటు రాజకీయాల్లో ఆమె ప్రముఖంగా వినిపిస్తున్నారు. ఈ క్రమంలో మల్లారెడ్డి ప్రధాని మోదీతో భేటీకావడం ఇప్పుడు తెలంగాణలో చర్చనీయాంశమైంది. ప్రీతిరెడ్డి గతంలోనే ఎంపీ పదవి కోసం ఆసక్తి చూపారు. బండి సంజయ్‌ను ఆమె కలవడం, స్వయంగా పార్లమెంటరీ స్థానం కోరుకుంటున్నట్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మళ్లీ గుర్తులోకి వచ్చాయి. మల్లారెడ్డి ఈ సమావేశంలో ప్రధానిని ఆమె పక్షాన కోరుతూ మధ్యవర్తిగా వ్యవహరించారా? ఇది ఒక వైపు లాభదాయకమైన రాజకీయ కుట్రగా కనిపిస్తోంది. ఈ భేటీ ఫలితంగా ప్రీతికి టికెట్ దక్కితే, మల్లారెడ్డి కూడా బీజేపీలో చేరే అవకాశం ఉందా? బీఆర్ఎస్‌లో ఇప్పటికే భిన్నాభిప్రాయాలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఇది పార్టీ మార్పు సూచనగా కనిపిస్తుంది. బీజేపీ తెలంగాణలో తన స్థానాన్ని బలోపేతం చేసుకోవాలనుకుంటే, స్థానిక నాయకులను ఆకర్షించడం సహజం. అయితే, ఇది బీఆర్ఎస్‌కు మరో షాక్‌గా మారవచ్చు. ఈ సంఘటన తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉంది. కుటుంబ ఆధారిత రాజకీయాలు ఎప్పుడూ వివాదాస్పదం. బీజేపీ ఎమ్మెల్యేలను, ఎంపీలను పెంచుకోవడం ద్వారా తన పట్టుకు బలం చేకూర్చుకుంటుందా? రానున్న రోజుల్లో ఈ చర్చలు మరింత ఉద్ధృతమవుతాయి.

# అడుగంటుతున్న భూ గర్భజలాలు

కరీంనగర్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్) వేసవిలో ఎండల తీవ్రత అంతకంతకు పెరుగుతుండగా, కరీంనగర్ జిల్లాలోని నీటివనరులన్నీ నిండుకున్నాయి. వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అడుగంటి ఒండ్రు మట్టి తేలితున్నాయి. జిల్లా పరిధిలోని చిన్న, మధ్య తరహా, భారీ ప్రాజెక్టుల్లో కూడా నీటి నిల్వలు అదిగంటుతున్నాయి. ఉక్కపోత, భరించలేని వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కూడా నీటిని అదే స్థాయిలో వినియోగిస్తున్నారు. ఈ ప్రభావం భూగర్భ జలాలపై పడుతోంది. చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నా రు. తమ స్థిరాస్తులు, ఆభరణాలు తనాఖా పెడుతూ, అట్టడుగుకు చేరిన నీటిని పైకి తె చ్చేందుకు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిమట్టంపై జిల్లా భూగర్భ జలవనరుల శాఖ విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ ఏడాది మార్చిలో 8.10 మీటర్లు, ఏప్రిల్ లో 9.02 మీటర్ల సగటు నీటిమట్టం నమోదైంది. గత ఏడాది వేసవిలో కూడా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. జూలై, ఆగస్టు నెలల్లో కురిసిన భారీ వర్షాలతో భూగర్భ జలమట్టంలో మార్పు వచ్చి, కొంతమేర ఉపశమనం కలిగింది. అనంతరం అసలు రెయినీ సీజన్లోనే వర్షా లు ముఖం చాటేయగా, ఎప్పటికప్పుడు భూగర్భజలాలు పాతాళానికి పడిపోతున్నా యి. అడపాదడపా వర్షాలు కురిసినా వాటి తో భూగర్భజలాలు పెరగలేదని భూగర్భ జల వనరుల శాఖ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో వేసవి తీవ్రతతో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా వరి పంట కు సరిపడా నీరు అందకపోవడంతో పం టలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తూ బావుల్లో పేరుకుపోయిన మట్టిని క్రేన్ల సహాయంతో తొలగిస్తున్నారు. నీటి నిల్వలు పెరగాలని ఆశిస్తూ పెద్ద మొ త్తంలో ఖర్చు పెట్టి బావులను శుభ్రం చేస్తున్నారు. అంతేకాకుండా, మరింత నీరు అం దుబాటులోకి రావాలనే ఉద్దేశంతో బావుల పక్కనే సైడ్ బోర్లు కూడా వేయిస్తున్నారు. కరీంనగర్ ఎల్ఎండీ సామర్థ్యం 24.034 టి ఎంబసీ లు కాగా జలాశయంలో నీటి నిల్వలు 6.9 టీఎంసీలకు పడిపోవడంతో నగరంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో ప్రతిరోజూ 55 ఎంఎల్డీల నీటిని సరఫరా చేసిన నగరపాలక సంస్థ, రెండు రోజులకు ఒకసారి సరఫరా చేసేందుకు సిద్ధం అవుతుంది ఎంఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథా చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మిడ్ మానేరు నుంచి ప్రస్తుతం 500 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారు.

# కొండపల్లి మేళా ప్రారంభం

యన్టీఆర్ ,కొండపల్లి బొమ్మలు, కొండపల్లి కోట అభివృద్ధి చేసే దిశగా అడుగులు పడనున్నాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. హెరిటేజ్ ట్రెక్కింగ్ ద్వారా వినూత్నంగా మేళా ను కలెక్టర్ లక్ష్మీశా, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శనివారం ప్రారంభించారు. కొండపల్లి గ్రామం నుంచి ఖిల్లా పైకి ట్రెక్కింగ్ చేసారుకలెక్టర్ లక్ష్మీ శా మాట్లాడుతూ కొండపల్లి కోట అభివృద్ధి, పర్యాటకం, వారసత్వ సంపదను కాపాడేలా కార్యక్రమాలు చేపట్టాం. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొండపల్లి బొమ్మల కళను కాపాడటం. ఈ హస్తకళాకారులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాలు చేపట్టాం. భవిష్యత్ తరాలకు మన సంస్కృతిని, సంపదను అందించడమే దీని ప్రధాన ఉద్దేశం.. గతంలో ప్రారంభించిన లేజర్ షో వంటి ప్రాజెక్టులను పునఃప్రారంభించి, కోటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ఘాట్ రోడ్డు వచ్చిన తర్వాత మూతపడిన పాత నడకదారిని అటవీ శాఖ సహకారంతో పునరుద్ధరిస్తున్నాం. దీనివల్ల పర్యాటకులు ట్రెక్కింగ్ చేసే అవకాశం కలుగుతుంది. రాజధాని ప్రాంతానికి సమీపంలో ఉండటంతో, కొండపల్లి కోటను ఒక ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావిస్తోంది. శని, ఆదివారాల్లో పర్యాటకుల రద్దీకి అనుగుణంగా భద్రత మరియు సౌకర్యాలను కల్పిస్తున్నారు. రోప్వే ఏర్పాటు గురించి కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని అన్నారు.

ఇయ్యాల తెలంగాణ






ఇయ్యాల తెలంగాణ: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఆ రాష్ట్రంలోని రాణిపేట జిల్లా షోలింగూర్ నియోజకవర్గం పండియానల్లూర్ లో నిర్వహించిన ఎన్నికల సభలో లోక్సభలో ప్రతిపక్ష నేత శ్రీ రాహుల్ గాంధీ గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు.. తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు శ్రీ భట్టి విక్రమార్క గారు, టీఎన్ సీసీ అధ్యక్షులు సెల్వ పెరుంతగై గారు, ఏఐసీసీ సీనియర్ పరిశీలకులు, ఉత్తరాఖండ్ ఎమ్మెల్యే ఖాజీ మహమ్మద్ నిజాముద్దీన్ గారు, షోలింగూర్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మునిరత్నం గారు తదితరులతో కలిసి హాజరయ్యారు. కాగా షోలింగూర్ నియోజకవర్గ ఏఐసీసీ పరిశీలకులుగా మధుయాష్కీ గారు.. నిన్నటి నుంచి రాహుల్ గాంధీ గారి సభ ఏర్పాట్లు, జన సమీకరణ తదితర విషయాలను పర్యవేక్షించారు.

## డ్రగ్స్ మత్తు రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని కఠిన చర్యలు: సీపీ సజ్జనార్‌టోబాకో ఉత్పత్తులు విక్రయిస్తున్న పాన్‌షప్స్‌పై ఏకకాలంలో తనిఖీలు

ఇయ్యాల తెలంగాణ: డ్రగ్స్ మత్తు రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు నగర పోలీస్? కమిషనర్? సజ్జనార్? అన్నారు. శనివారం పాతబస్తీ పాన్?షప్స్?లో పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు సహకరించాలని ఎవరైనా అమ్మితేనిర్వహించారు. ఆపరేషన్ సేఫ్? స్కూల్? విద్యాసంస్థల సమీపంలోని ? పాన్?షప్స్?లో టొబాకో ప్రొడక్ట్స్?ఉత్పత్తులు విక్రయిస్తున్న పాన్?షప్స్?పై ఏకకాలంలో



తనిఖీలు నిర్వహించారు. దాదాపు 500 పాన్?షావ్?లలో గుట్కాలను, తంబాకు, సిగిరెట్ల సీజ్? చేసి కేసులను నమోదు చేసినట్లు సజ్జనార్? వెల్లడించారు. పాతనగరంలో జరుగుతున్న అనేక నేరాలకు మత్తే ప్రధాన కారణంగా కనిపిస్తుందని ఆ మత్తు మొదలు పాన్ షావ్ లలో సిగిరెట్లతో మొదలవుతుందని ఆయన అన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు సహకరించాలని ఎవరైనా టొబాకో ప్రొడక్ట్స్?ఉత్పత్తులను అమ్మితే పోలీసులకు తెలియజేయలని ఆయన కోరారు.

## ఏటీఎం సెంటర్లలో నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసాలకు పాల్పడుతున్న నిందితుడు అబ్దుల్లా ఒబైద్ అల్ కతేరి అరెస్ట్

ఇయ్యాల తెలంగాణ : చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏటీఎం సెంటర్లలో నకిలీ ఫోన్ పే యాప్‌తో మోసాలకు పాల్పడుతున్న నిందితుడు అబ్దుల్లా ఒబైద్ అల్ కతేరి అలియాస్ అబ్దుల్లా అరెస్ట్- చేసి రిమాండ్? కు తరలించినట్టుచాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ. సుధాకర్, చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ ఆర్. గోపి, డి.ఐ బి. రామస్వామి లు వెల్లడించారు. శనివారం చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్ లో



చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ. సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం చాంద్రాయణగుట్ట ఎక్స్ రోడ్ వద్ద ఉన్న యాక్సిస్ బ్యాంక్ ఏటీఎం కేంద్రం వద్ద అమాయక డిపాజిటర్లను లక్ష్యంగా చేసుకుని, నకిలీ ఫోన్ పే స్క్రీన్‌షాట్‌లతో మోసాలకు పాల్పడుతున్న భవానీ నగర్ తలాబ్ కట్ట చెందిన నిందితుడి అబ్దుల్లా ఒబైద్ అల్ కతేరి అలియాస్ అబ్దుల్లా (25)ని చాంద్రాయణగుట్ట పోలీసులు చాకచక్యంగా అరెస్ట్ చేశారు. ఈ నెల 6వ తేదీన అబ్దుల్ నాసర్ అనే వ్యక్తి చాంద్రాయణగుట్ట ఎక్స్ రోడ్ వద్ద ఉన్న ఏటీఎం లో రూ. 10,000- డిపాజిట్ చేస్తుండగా, నిందితుడు అతడిని కలిశాడు. తనకు అత్యవసరంగా నగదు కావాలని, తన వద్ద ఉన్న డబ్బును బాధితుడి అకౌంట్‌కు ఫోన్ పే ద్వారా పంపిస్తానని నమ్మబలికాడు. తన ఫోన్ లోని నకిలీ యాప్ ద్వారా డబ్బులు పంపినట్లు తప్పుడు స్క్రీన్‌షాట్ చూపించి, బాధితుడి నుండి నగదు తీసుకుని పరారయ్యాడు. నిందితుడి నుండి రూ. 10,000/- నగదును స్వాధీనం చేసుకున్నారు. చాంద్రాయణగుట్ట ఎస్.హెచ్.ఓ ఆర్. గోపి, డి.ఐ బి. రామస్వామి, ఎస్.ఐలు జె. కిరణ్ కుమార్, వి. శ్రీనివాసరావు, శ్రీ ఎస్. చంద్రారెడ్డి మరియు సిబ్బంది నిందితుడిని అతి తక్కువ సమయంలో గుర్తించి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచారు. ఉత్తమ పనితీరు కనబరిచిన ఈ బృందానికి తగిన రివార్డులు అందజేయనున్నట్లు చాంద్రాయణగుట్ట ఏసీపీ ఎ. సుధాకర్ తెలిపారు.

# నేడు బూర్గుపేట గ్రామంలో నేతకాని సభ

### జిల్లా నాయకులు దుర్గం బానయ్య నేతకాని, జాడి నరేష్ నేతకాని

ములుగు , ములుగు జిల్లా వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని బూర్గుపేటలో నేడు తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం జిల్లా మహాసభ ఏర్పాటు చేయడం జరుగుతుందని, ములుగు జిల్లా ప్రజలు, నాయకులు అందరూ తప్పకుండా భారీగా తరలి వచ్చి ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకులు దుర్గం బానయ్య నేతకాని, జాడి నరేష్ నేతకాని పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సమయం సరిపోక నేతకాని సీనియర్ నాయకులకు,చాలా మంది ప్రజలకు తెలియజేయడంలో ఆలస్యం అవుతుందని, అందరూ అన్యత భావించకుండా తప్పకుండా ఈ పత్రిక ప్రకటన ద్వారా ఈ మహాసభకు తరలి రావాలని కోరారు. ఇటీవల విడుదల చేసిన కుల గణన వివరాల్లో మా కుల పేరు ప్రస్తావించకపోవడం పాలకుల పరాకాష్ఠ పాలనకు నిదర్శనం అని తక్షణమే నేతకాని కులస్థుల అసలు జనగణన ను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ కులాలలో అతి పెద్ద రెండవ కులం అయిన నేతకాని కుల గణన బయటపెడితే రిజర్వేషన్లు,రాజకీయ వాటాలు ఇవ్వబడుతుందనే కుట్రతో మా జనాభాను దాచి పెట్టారని,తక్షణమే మన కుల గణనను పూర్తి స్థాయిలో బయట పెట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర గెజిట్లో కూడా మా కుల పేరు లేకపోవడం బాధాకరమని,కేంద్ర గెజిట్ లో మా నేతకాని కుల పేరుని గెజిట్ లో చేర్చాలని డిమాండ్ చేశారు. అలాగే ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో హక్కులు లేక మా కులస్థుల బ్రతుకులు ఆగమవుతున్నాయని,1/70 ,పిసా చట్టాలను పటిష్టం చేస్తూ మా కులస్తులకు ఏజెన్సీ ప్రాంత చట్టాలను వర్తింపజేయాలని లేదంటే మా కులస్తులను కొండకోయ నేతకాని పేరుతో ఎస్టీ కేటగిరి లో చేర్చాలని,మా కులస్థుల ఆర్థిక అభివృద్ధి కొరకు 1000 కోట్లతో ఏజెన్సీ నేతకాని అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేయాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఇంకా ఈ మహా సభకు ముఖ్య అతిథితులుగా ఏజెన్సీ నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,తెలంగాణ నేతకాని సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి ఈశ్వర్ నేతకాని, రాష్ట్ర నాయకులు ఏజెన్సీ నేతకాని సంఘం ముఖ్య నాయకులు,కుల ప్రజల బాగు కోసం నిరంతరం శ్రమిస్తున్న నేతకాని జన నాయకుడు జాడి శ్రీనివాసరావు నేతకాని ,యువ నాయకులు రామటేంకి బాబూరావు నేతకాని,కుమ్మరి వెంకటేశ్వర్లు నేతకాని నాయకులు ఇంకా రాష్ట్ర, జిల్లా, మండలాల సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

## సుప్రీంకోర్టు తీర్పుపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించాలి.. మాల సంఘాల జాక్ గౌరవ సలహాదారుడు డిమాండ్

హనుమకొండ చౌరస్తా : దళిత క్రిస్టియన్స్?కు ఎస్సీ హోదా వర్తించదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డిస్పందన తెలిపాలని మాల సంఘాల జాక్ గౌరవ సలహాదారుడు, రిటైర్డు డీఎస్పీ దామెర నర్సయ్య కోరారు. శనివారం గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.గతంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు గైడ్ లైన్స్? పూర్తిస్థాయిలో వెలువడక ముందే సీఎం రేవంత్‌రెడ్డి అత్యుత్సాహంతో నిండు శాసనసభలో ప్రకటించి, సుప్రీంకోర్టు సూచనలకు వ్యతిరేకంగా, అశాస్త్రీయమైన ఎస్సీ వర్గీకరణ చేశారని గుర్తుచేశారు. దళిత క్రిస్టియన్స్? ఎస్సీ హోదా రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు స్పష్టంగా ఇచ్చి, 20 రోజులు గడిచినా సీఎం నిర్ణయం తీసుకోకపోవడం, మౌనం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ముందుగా మత ప్రతిపాదికగా లెక్కలు తీయాలని డిమాండ్ చేశారు.ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి వరంగల్ ఉమ్మడి



జిల్లా చైర్మన్ బండి అశోక్ మాట్లాడుతూ మాదిగలు, రెడ్లు ఒకటేనని చెప్పుకున్న సీఎం రేవంత్‌రెడ్డి మాదిగల పక్షపాతిగా వ్యవహరిస్తూ, మాలలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో పెద్ద మాదిగనని చెప్పుకున్న దళిత ద్రోహి నారాచంద్రబాబు నాయుడు వారసత్వాన్ని రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారని ఆరోపించారు.కాంగ్రెస్ పార్టీలో ఎక్కువ రోజులు కొనసాగలేనని గ్రహించిన ముఖ్యమంత్రి ముందస్తుగా మాదిగల ఓటు బ్యాంకు కోసం వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. సమావేశంలో రిటైర్డు ఈఈ బండెల భద్రయ్య, మాల సంఘాల జాక్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్లు శేషాద్రి నాగులు, వంగేటి రాజమౌళి, పోతుల కొమ్మలు, సాదు కుమారస్వామి,కట్ట బాబు, గొర్రె రమేష్,కొరివి అనీల్, కునమల్ల రవీందర్, బుజుగుండ్ల అనిల్, సదువాల సారంగపాణి, సురాసి విక్రమ్, జిట అనిల్, దార నర్సింగరావు పాల్గొన్నారు.

## తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన బీజేపీ ఎంపీ క్షమాపణ చెప్పాలి : హరీష్‌రావు

జగిత్యాల : బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న కేసీఆర్ ‘ ప్రజా ఆశీర్వాద సభ’ ఏర్పాట్లను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన



మీడియా సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలకు తెలంగాణ ఎంపీ , కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సపోర్టుగా నిలిచారని ఆరోపించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడితే తెలంగాణలో 8 మంది బీజేపీ, 8 మంది కాంగ్రెస్ ఎంపీ లు ఉన్నా ఏం లాభమని అన్నారు. బీజేపీ ఎంపీ బేషరతుగా తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ ఆత్మగౌరాన్ని దెబ్బ తీసిన ఎంపీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని వెల్లడించారు. బడేబాయి, చోటే బాయి బంధం మరో సారి బయటపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఎంపీ లు పార్లమెంట్లో లేని లోటు నిన్న స్పష్టంగా కన్పించిందని హరీష్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఉద్యమం, ప్రజల మీద విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.మహిళా బిల్లు విషయం లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నాటకామాడుతున్నాయని విమర్శించారు.ఎంపీ తేజస్వి యాదవ్ వ్యాఖ్యలను సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఖండించలేదని,రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం రాబోతుందని, దానికి నిదర్శనం బీఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి చేరిక అని స్పష్టం చేశారు. రాజకీయల్లో విలువలతో కూడిన రాజకీయం చేసిన వ్యక్తి జీవన్ రెడ్డి అని కొనియాడారు.



ఇయ్యాల తెలంగాణ: తెలంగాణ ఏర్పాటును భారత పాకిస్తాన్ తో పోల్చిన బిజెపి ఎంపీ దృష్టి బొమ్మను దగ్ధం చేస్తున్న హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి? ? మీర్? ముస్తఫా అలీ ముజామిల్? ఖాద్రి

## కొండ మలుపు నుంచి కిందకు దూసుకెళ్లిన వాహనం.. ఏడుగురు టీచర్స్‌తో సహా 9 మంది మృతి





చెన్నై: ఒక టూరిస్ట్ వాహనం కొండ మలుపులో అదుపుతప్పింది. కిందకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ఉపాధ్యాయులతో సహా 9 మంది మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. దీంతో ఆ ప్రభుత్వ స్కూల్‌లో విషాదం నెలకొన్నది. తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కేరళలోని మలప్పురం జిల్లా పాంగ్-పల్లిపరంబ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బందితో కూడిన 13 మంది పర్యటన కోసం తమిళనాడు వెళ్లారు. శుక్రవారం ట్రావెల్ టెంపో వాహనంలో వాల్పరై హిల్ స్టేషన్‌ను సందర్శించారు.కాగా, వాల్పరైలో పర్యటన ముగించుకుని కొండ నుంచి కిందకు దిగుతుండగా ఆ వాహనం ప్రమాదానికి గురైంది. 13వ హెయిర్‌పిన్ మలుపు వద్ద అది అదుపుతప్పి కిందకు దూసుకెళ్లింది. 9వ హెయిర్‌పిన్ మలుపులోని రోడ్డుపై బోల్తాపడింది. ఆ వాహనంలో ఉన్న 13 మందిలో ఒక బాలిక, ఏడుగురు మహిళలు, ఒక పురుషుడితో సహా 9 మంది ఈ ప్రమాదంలో మరణించారు. మృతుల్లో ఏడుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.మరోవైపు ట్రావెల్ వాహనం డ్రైవర్, మరో ముగ్గురు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నది. వీరిలో ఇద్దరిని కోయంబత్తూరు వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ప్రధాని మోదీ, కేరళ సీఎం విజయన్ తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. టీచర్లు, సిబ్బంది మరణించడంతో కేరళలోని పాంగ్-పల్లిపరంబ ప్రభుత్వ స్కూల్‌లో విషాదం నెలకొన్నది.

## గురుకులాల పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నా స్పందన లేదు : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



రైతులేమన్నా గానీ రాజకీయాలే ముఖ్యమన్నట్టు ఈ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడుతూ.. రైతుల గురించి ఆలోచన లేదు, చదువుకునే యువకుల గురించి ఆలోచన లేదు.. గురుకులాల్లో పిల్లలు చనిపోతుంటే ఆలోచన లేదు. గురుకులాల పిల్లలు పిట్టల్లా రాలిపోతున్నరు. బీదవాళ్లే కదా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంబంధించిన పిల్లలే కదా.. విషాహారం తిని చనిపోతుంటే కనీసం స్పందన కూడా లేదు ఈ ప్రభుత్వానికి అని ధ్వజమెత్తారు.రేవంత్ రెడ్డి సర్కార్‌కు అసలు ఏం జరుగుతుంది..? ఎలాంటి చర్యలు తీసుకున్నామన్నా ఆలోచన కూడా లేదు. రైతులు చనిపోతుంటే మీరు ధైర్యంగా ఉండండి అని చెప్పే ఆలోచన ఈ ప్రభుత్వానికి లేదన్నారు. యూరియా బుక్ చేసుకుంటే నాగ్‌సాని పల్లెలో ఉన్న రైతుకు కోస్గిలో వచ్చిందట. అక్కడ షాపు దగ్గరికి పోయి తెచ్చుకోవాలట. మరి అక్కడి నుంచి ఇక్కడిదాకా రైతుకు ట్రాన్స్‌పోర్టేషన్ ఎవరిస్తరు రైతుకు. ఇవన్నీ ఏదో ఒకటి చేయాలనే ఆలోచన లేని పనులన్నారు. మరి కేసీఆర్ ఉన్నప్పుడు రైతులకు ఎరువు, యూరియా సమస్యలు ఎందుకు రాలేదు. అంటే చిత్తశుద్ధి ఉన్న నాయకుడు ఉన్నడు కాబట్టి రైతులకు వర్షం పడే కంటే రెండు నెలల ముందే కేసీఆర్ ప్రణాళిక వేసుకున్నారన్నారు.

## రిటైర్డ్ ఉద్యోగుల ఉసురు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగులుతుంది : మాజీ చైర్మన్ జి దేవీ ప్రసాద్

హైదరాబాద్ : తెలంగాణలో ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులను ఇబ్బందులపాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉసురు తగులుతుందని ఉద్యోగ సంఘాల జేఏసీ మాజీ నేత , కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి దేవీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఉద్యోగులు,ఉపాధ్యాయుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, ఏ ఒక్క హామీ అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఉద్యోగులకు 5 డీఎలు పెండింగ్‌లో ఉన్నాయని,సీపీఎస్ రద్దుపై ఇప్పటి వరకు కమిటీ వేయలేదని విమర్శించారు.ఉద్యోగులకు డిజిటల్ హెల్త్ కార్డులు ఏమయ్యాయని ప్రశ్నించారు.రిటైర్డ్ ఉద్యోగులు 86 మంది చనిపోయారని,రిటైర్డ్ ఉద్యోగులకు చావు పరిష్కారం అయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ఉద్యోగులకు ఇవ్వాల్సిన రూ. 14 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుకు హైకోర్టు మెట్లు ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చనిపోయిన రిటైర్డ్ ఉద్యోగులకు కోటి 20 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.తెలంగాణ సమాచారంఉద్యోగుల్లో ఆంధ్రా పెత్తనం నడుస్తోందని, ఎక్సైజ్ శాఖలో కమిషనర్ వేధింపులు తట్టుకోలేక తెలంగాణ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేశారని వెల్లడించారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి మధ్య సోదర బంధం ఉందని, బీజేపీ రాజకీయంతోనే మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లు ఆగిపోయింది డీలిమిటేషన్, మహిళా బిల్లును లింక్ చేశారని ఆరోపించారు.టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రానంద్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా మహిళా బిల్లును కాంగ్రెస్, బీజేపీ అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల అమలు కావడం బీజేపీకి ఇష్టం లేదని అన్నారు.

# ప్రాణాలు తీస్తున్న స్లీపర్ బస్సులు

హైదరాబాద్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్) హైదరాబాద్ మహానగరంలో నడి రోడ్డుపై స్లీపర్ బస్ తగలబడిపోయింది. ప్రయాణికులు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. నిత్యం వేలాది వాహనాలతో రద్దీగా ఉంటే కూకట్‌పల్లి- కేపీహెచ్‌బీ రహదారిపై ఈ దుర్ఘటన జరిగింది. ఇది ప్రయాణికులను, స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. ఈ ఘటన కేవలం ఒక ప్రమాదంగానే కాకుండా దేశంలో నడుస్తున్న స్లీపర్ బస్‌ల భద్రతపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. శుక్రవారం రాత్రి మియాపూర్ నుంచి పాలకొల్లుకు బయల్దేరిన శ్రీ దుర్గా మహేశ్వరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కేపీహెచ్‌బీ పరిధిలోని పద్మావతీ ప్లాజా బస్ స్టాప్, మెట్రో పిల్లర్ 734 సమీపంలోకి రాగానే బస్ డ్రైవర్ క్యాబిన్ నుంచి దట్టమైన పొగలు రావడం గమనించాడు. వెంటనే డ్రైవర్, సహాయకుడు అప్రమత్తమయ్యారు. బస్‌ను పక్కకు నిలిపివేసి అందులోని 18 మంది ప్రయాణికులను వెంటనే కిందకు దించేశారు. ప్రయాణికులు కిందకు దిగిన కొద్ది నిమిషాల్లోనే మంటలు బస్ అంతటా వ్యాపించి, వాహనం పూర్తిగా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు అదుపు చేసినప్పటికీ బస్ పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినప్పటికీ బస్ అస్తిపంజరంలా మారిపోయింది. ప్రాథమిక సమాచారం మేరకు ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ లేదా ఏసీ యూనిట్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలే ఈ ప్రమాదానికి కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా స్లీపర్ బస్‌ల డిజైన్‌పై తీవ్ర విమర్శలు ఉన్నాయి. వీటిని కొన్ని దేశాలు డెత్ బస్‌లుగా అభివర్ణిస్తారు. స్లీపర్ బస్సుల్లో బెర్త్‌ల మధ్య ఉండే గ్యాలరీలు చాలా ఇరుకుగా ఉంటాయి. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు త్వరగా బయటకు రావడానికి వీలుపడదు. సాధారణ బస్సులతో పోలిస్తే స్లీపర్ బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు అందుబాటులో ఉండడం తక్కువ. పైగా ఉన్న ఎగ్జిట్‌లు కూడా బెర్త్‌ల వల్ల మూసుకుపోయే



అవకాశం ఉంది. కూకట్‌పల్లి ఘటనలో డ్రైవర్ అప్రమత్తమవ్వడం, ప్రయాణికులు మెళకువగా ఉండటం వల్ల పెను ప్రమాదం తప్పింది. కాని గతంలో జరిగిన ప్రమాదాలు చూస్తే ప్రయాణికులు గాఢ నిద్రలో ఉండటం వల్ల ఏదైనా జరిగితే వెంటనే స్పందించే సమయం చాలా తక్కువగా ఉంటుంది. పై బెర్త్‌ల నుంచి కిందకు దిగి బయటకు రావడం అత్యవసర సమయంలో కష్టమవుతుంది. భారత్‌లో స్లీపర్ బస్సులు విరివిగా వాడుకలో ఉన్నప్పటికీ అనేక అభివృద్ధి చెందిన దేశాలు వీటిని నిషేధించాయి. చైనా ప్రభుత్వం వీటిని 2012లోనే నిషేధించింది. ఉత్పత్తి, రిజిస్ట్రేషన్లపై పూర్తిగా బ్యాన్ వేశారు. 2012, 2011లో జరిగిన ఘోర ప్రమాదాల్లో దాదాపు 77 మంది చనిపోయారు. దీంతో చైనా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. జర్మనీలో కూడా 2006 నుంచి స్లీప్ కోచ్‌లను నిషేధించారు. బస్ కదులుతున్నప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలని అక్కడి రూల్. అయితే స్లీపర్ పొజిషన్‌లో అది వీలుపడదని తేలడంతో బ్యాన్ వేశారు యూకేలో 2000 నుంచి నిషేధం ఉంది. కేవలం కొన్ని ప్రత్యేక టూరిస్ట్ కోచ్‌లకు మాత్రమే పరిమిత అనుమతి ఉంది. వియత్నాంలో పూర్తిగా నిషేధం లేకపోయినా కొండ ప్రాంతాల్లో, కొన్ని ప్రధాన హైవేలపై స్లీపర్ బస్‌ల రాకపోకలపై కఠిన ఆంక్షలు విధించారు. భారత్‌లో చాలా ప్రాంతాల్లో స్లీపర్ బస్‌లు ప్రమాదాల బారిన పడుతున్నాయి. రోజూ ఏదో ప్రాంతంలో స్లీపర్ బస్‌లు ప్రమాదానికి గురి అవుతున్న వార్తలు చూస్తున్నాం. మేజర్ యాక్సిడెంట్ జరిగినప్పుడు అధికారులు, ప్రభుత్వాలు హడావిడి చేయడమే తప్ప వాటిపై సీరియస్‌గా చర్యలు తీసుకున్న ఒక్క ఘటన కూడా లేదు. దీంతో ఉల్లంఘనలు, ప్రమాదాలు సర్వసాధారణమైపోయాయి. పీహెచ్‌బీ ఘటనలో 18 మంది ప్రాణాలతో బయటపడటం కేవలం డ్రైవర్ సమయస్ఫూర్తి వల్ల జరిగిన అదృష్టం మాత్రమే. కానీ ప్రతి సారీ అదృష్టం తోడు ఉండకపోవచ్చు. అందుకే ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని సరైన చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# అమరనాథ్ రిజిస్ట్రేషన్ షురూ...

శ్రీనగర్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)దేశంలోని అత్యంత ముఖ్యమైన మతపరమైన యాత్రలలో ఒకటైన పవిత్ర అమర్‌నాథ్ యాత్ర 2026 కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఏప్రిల్ 15న ప్రారంభమైంది. ఈ సంవత్సరం ఈ యాత్ర జూలై 3న ప్రారంభమై ఆగస్టు 28 వరకు 57 రోజుల పాటు కొనసాగుతుంది. యాత్ర విజయవంతంగా, సురక్షితంగా జరిగేలా చూసేందుకు, ఈసారి అమర్‌నాథ్ పుణ్యక్షేత్ర బోర్డు పలు ముఖ్యమైన ఏర్పాట్లు, మార్గదర్శకాలను జారీ చేసింది. రిజిస్ట్రేషన్ జరిగిన మొదటి రోజే బ్యాంకుల వద్ద పొడవైన క్యూలు కనిపించాయి.ప్రతి సంవత్సరం లక్షలాదిభక్తులు శివ దర్శనం కోసం ఈ కఠినమైన పర్వత యాత్రను చేపడతారు. దీని ఫలితంగా, అధికారులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను తప్పనిసరి చేయడంతో పాటు, భద్రత, ఆరోగ్య చర్యలను మరింత కఠినతరం చేశారు. ఈసారి అమర్‌నాథ్ యాత్ర కోసం రెండు సాంప్రదాయ మార్గాలను ఏర్పాటు చేశారు.మొదటి మార్గం48 కిలోమీటర్ల పొడవైన నున్వాన్-పహల్గామ్ మార్గం, ఇది పహల్గామ్ గుండా వెళుతుంది . ఈ మార్గం పొడవైనప్పటికీ, ఎత్తు క్రమంగా పెరుగుతూ ఉంటుంది, కాబట్టి దీనిని సాంప్రదాయమైనదిగా, సాపేక్షంగా సురక్షితమైనదిగా పరిగణిస్తారు.రెండవ మార్గం దగ్గరి దారి అయినప్పటికీ కష్టతరమైన 14-కిలోమీటర్ల బాల్టాల్ మార్గం, ఇది బాల్టాల్ వద్ద ప్రారంభమవుతుంది. ఈ మార్గం తక్కువ ప్రయాణ సమయాన్ని అందిస్తుంది, కానీ ఇందులో నిటారుగా ఉండే ఎత్తులు , అధిక ప్రమాదం ఉంటాయి.ఆన్‌లైన్ - ఆఫ్‌లైన్ ఎంపికలు రెండూ అందుబాటులో ఉన్నాయిభక్తులు అమర్‌నాథ్ పుణ్యక్షేత్ర బోర్డు అధికారిక వెబ్‌సైట్ , మొబైల్ యాప్ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 550కి పైగా బ్యాంకు శాఖల ద్వారా ఆఫ్‌లైన్ నమోదు సౌకర్యం కూడా అందుబాటులో ఉంది.ఈ బ్యాంకులలో స్టేట్ బ్యాంక్, పంజాబ్ నేషనల్





బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్, యెస్ బ్యాంక్ , జమ్మూ అండ్ కాశ్మీర్ బ్యాంక్ ఉన్నాయి. యాత్రలో పాల్గొనడానికి తప్పనిసరి ఆరోగ్య ధృవీకరణ పత్రం (సిహెచ్‌సి) అవసరం. ఈ ధృవీకరణ పత్రాన్ని అధీకృత వైద్యుడు ఏప్రిల్ 8, 2026న లేదా ఆ తర్వాత జారీ చేయాలి. ఈ కష్టతరమైన ఎత్తైన మార్గంలో ఉన్న ఆరోగ్య ప్రమాదాల దృష్ట్యా ఈ చర్య చాలా అవసరమని నిర్వాహకులు భావిస్తున్నారు. ఇది కాకుండా, ప్రయాణికుల స్థానాన్ని గుర్తించడం ద్వారా వారి భద్రతను నిర్ధారించేందుకు, ప్రతి ప్రయాణికుడికి ఖీఈఎఆ కార్డును కూడా తప్పనిసరి చేశారు.నమోదు రుసుము: ఒక్కొక్కరికి ?150వయోపరిమితి: 13 నుంచి 70 సంవత్సరాలు6 వారాల కంటే ఎక్కువ గర్భవతిగా ఉన్న మహిళలు ప్రయాణించడానికి అనుమతి లేదు.తప్పనిసరి పత్రాలు: అసలు ఫోటో గుర్తింపు కార్డు , వైద్య ధృవీకరణ పత్రంయాత్ర తేదీకి ఏడు రోజుల ముందు వరకు మాత్రమే నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు స్పష్టం చేశారు. నమోదు చేసుకోని యాత్రికులను ప్రయాణానికి అనుమతించరు.యాత్ర సమయంలో భద్రతా సంస్థలు, జమ్మూ కాశ్మీర్ పోలీసులు, ఇతర బలగాలను మోహరిస్తారు. ఏవైనా అత్యవసర పరిస్థితులకు తక్షణమే స్పందించేందుకు పర్వత మార్గాల వెంబడి వైద్య బృందాలు, సహాయక బృందాలు, సహాయ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తారు. 2026 అమర్‌నాథ్ యాత్రకు సన్నాహాలు ముమ్మరమయ్యాయి. యాత్రికులకు సౌకర్యాలు మెరుగుపరచడంపై యంత్రాంగం దృష్టి సారిస్తుండగా, భద్రత, ఆరోగ్య ప్రమాణాలను కఠినంగా అమలు చేస్తూ యాత్ర సురక్షితంగా, క్రమబద్ధంగా జరిగేలా చూసేందుకు కూడా కృషి చేస్తోంది. యాత్రికులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అన్ని మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.

# గ్యాస్ ఏజెన్సీల దందా...

వరంగల్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)హనుమకొండ జిల్లాలో గ్యాస్ పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న తీరు సామాన్య ప్రజలకు, చిరు వ్యాపారులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆన్లైన్ బుకింగ్ పేరుతో జాప్యం చేస్తూ.. మరోవైపు అధిక ధరలకు బ్లాక్లో సిలిండర్లను విక్రయిస్తూ ఏజెన్సీలు కాసుల వేటలో పడ్డాయనే విమర్శలు బాహటంగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని ఫలితంగా, దోపిడీ పర్వం యథేచ్ఛగా సాగుతోందనే విమర్శలు వస్తున్నాయిగ్యాస్ కొరత కారణంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొంతకాలం గడువు విధిస్తూ ఆన్లైన్ బుకింగ్ విధానం వినియోగదారులకు సౌకర్యంగా ఉండాల్సింది పోయి, ఇబ్బందుల పాలయ్యేలా చేస్తోందని వినియోగదారులు చెబుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఒక సిలిండర్ బుక్ చేస్తే అది ఇంటికి చేరడానికి 20 రోజులకు పైగా సమయం పడుతోందని, దీనివల్ల సామాన్యులు కట్టెల పొయ్యి వైపు చూడాల్సిన పరిస్థితి తలెత్తుతుందని చెబుతున్నారు. వెంటనే ఈ ఆన్లైన్ విధానాన్ని పక్కన పెట్టి, పాత పద్ధతిలోనే ఇంటింటికీ సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.కొన్ని ఏజెన్సీలు, డెలివరీ బాయ్ లు అనుసరిస్తున్న కొత్త తరహా మోసం వినియోగదారులను విస్మయానికి గురిచేస్తోంది. గ్యాస్ పంపిణీ చేయకముందే వినియోగదారుల వద్ద నుంచి రకరకాల సాకులతో ఓటిపి లను సేకరిస్తున్నారు. సాఫ్ట్వేర్లో డెలివరీ అయినట్లు చూపిస్తూ.. ఆ సిలిండర్లను బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.వంట గ్యాస్ ధర అధికారికంగా రవాణా చార్జీలతో కలిపి 1000 ఉండగా, బ్లాక్లో రూ. 2 వేలకు విక్రయిస్తున్నారని, ఇక ఇదే కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 1850 ఉండగా, ఏకంగా 3వేలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్యాస్ ధరల సెగ హోటల్ యజమానులకు, బజ్జీల బండి వ్యాపారులకు గట్టిగా తగులుతోంది. కమర్షియల్ గ్యాస్ ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరడంతో వ్యాపారాలు సాగించడం భారంగా మారింది. పోనీ కట్టెల పొయ్యి మీద వంట చేద్దామన్నా.. కట్టెల ధరలు కూడా వేలల్లో ఉండటంతో 'ముందు నుయ్యి.. వెనుక గొయ్యి' చందంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా ఇంత బహిరంగంగా అక్రమాలు జరుగుతున్నా, పౌరసరఫరాల శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బాధితులు ప్రశ్నిస్తున్నారు.

# మార్కెట్ లో మ్యాంగో హవా

రంగారెడ్డి, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)పండ్లకు రారాజు అయినా మామిడి సీజన్ వచ్చింది. మార్కెట్ లో మ్యాంగో హవా మొదలైంది. హైదరాబాద్ శివారు ప్రాంతమైన బాటసింగారంలోని గడ్డి అన్నారం పండ్ల మార్కెట్కు మామిడి కాయల రాక క్రమంగా పెరుగుతూ ఉంది రాష్ట్రంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కావడంతో రైతులు, వర్తకులు, చిరు వ్యాపారులు, వినియోగదారులతో సందడి వాతావరణం నెలకొంది.ఈ ఏడాది ధరలు కొంత ఆశాజనకంగా ఉండటంతో క్రయ, విక్రయాలు ఊపందుకుంటున్నాయి. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని మార్కెట్ లో మామిడి క్రయ విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. బాటసింగారం మార్కెట్ లో మామిడి కుప్పలతో నిండిపోయాయి. ఆంధ్రప్రదేశ్ కర్ణాటక, తెలంగాణలోని అల్లాపూర్, గద్వాల్, రంగారెడ్డి నల్గొండ, వరంగల్, సూర్యాపేట్, మహబూబ్నగర్, తిమ్మాజీపేట్, కరీంనగర్, వికారాబాద్, అనంతపూర్, పరిగి, వనపర్తి, యాదగిరిగుట్ట, అంకిరావుపల్లి, చారకొండ తదితర ప్రాంతాల నుంచి మామిడి లోడ్లతో లారీలు, గూడ్స్ వాహనాలు, ఆటో ట్రాలీలు పండ్ల మార్కెట్ కు తరలివస్తున్నాయి. ఇప్పటివరకు సుమారు 2,48, 219 క్వింటాళ్లు దిగుమతులు ఎగుమతులు జరిగాయి. నాణ్యతనుబట్టి టన్నుకు సగటున రూ.30 వేల నుంచి రూ.40 వేల ధర పలుకుతోంది. మంచి రకాలకు క్వింటా




1 లక్ష పలుకుతుంది. మార్కెట్ కు వచ్చిన మామిడిని రాజస్థాన్, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తున్నారు.బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కు ప్రస్తుతం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి బెనిషాన్, తోతా పూరి, హిమాయత్, నాతి, పెద్ద రసాలు, చిన్న రసాలు, సుందరి, మల్లిక, కేసరి, దాసేరి, అప్పుసా తదితర రకాల మామిడి పండ్లు దిగుమతి అవుతున్నట్లు అధికారులు తెలిపారు. వీటిల్లో అత్య ధిక ధర హిమాయత్ రకం కిలో రూ.200 ధర పలు కుతుండగా, అత్యల్పంగా నాటి రకం కిలో రూ.8-14 ధర పలుకుతోంది. వీటిలో చెట్టుపైనే కవర్ కట్టిన పండ్లకు అధిక డిమాండ్ ఉండడంతో పాటు ధర కూడా టన్నుకు రూ. లక్ష వరకు పలుకు తోందని అధికారులు పేర్కొంటున్నారు. మార్కెట్ లో క్రయవిక్రయాలు సజావుగా సాగే విధంగా, ఎలాంటి ఇబ్బందులకు లేకుండా ఏర్పాట్లు చేశాం. మార్కెట్ ప్రాంగణంలో మామిడి పండ్లతో వచ్చే వాహనాలు సాఫీగా రాక పోకలు సాగించేలా అంతర్గత రోడ్లు నిర్మించాం. మార్కెట్ లో రైతులు, వ్యాపారులు దాహం తీర్చుకునేందుకు చల్లటి తాగునీటి యంత్రాలు ఏర్పాట్లు చేశాం.మామిడిని ప్యాకింగ్ చేసే క్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారులు అనుమతులు ఇచ్చిన ప్రకారమే ఇథలిన్ ప్యాకెట్లను మోతాదులో వాడే విధంగా వ్యాపారులకు సూచనలు చేశాం. నిబంధనలను అతిక్రమిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటున్నారు అధికారులు

# బీజేపీని ముంచేస్తున్న సొంత నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయాల్లో తిరుగులేని శక్తిగా ఎదగాలని కలలు కంటున్న భారతీయ జనతా పార్టీకి ఇప్పుడు బయటి ప్రత్యర్థుల కంటే లోపలి శత్రువులే ఎక్కువయ్యారు. కొత్త రక్తాన్ని ఎక్కించుకుని పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన సమయంలో.. కొందరు నేతలు చేరికలకు బ్రేక్ వేస్తున్నారు. కొత్త వాళ్లు వస్తే తమ ఉనికికి ఎక్కడ ముంపు ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. దీంతో నేతల మధ్య విభేదాలు తారస్థాయికి చేరాయి.రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచంద్రరావు పగ్గాలు చేపట్టినప్పటి నుండి పార్టీని ఒకతాటిపైకి తెచ్చేందుకు గట్టిగానే ప్రయత్నిస్తున్నారు. ఆయన నిరంతరం జిల్లాల్లో పర్యటిస్తూ, కార్యకర్తలను కలుస్తూ పార్టీలో జోష్ నింపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో అధ్యక్షుడు పడుతున్న కష్టానికి ఇతర ముఖ్య నాయకుల నుండి ఆశించిన మద్దతు లభించడం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. పార్టీని తమ సొంత సంస్థగా భావించి పని చేయాల్సిన అగ్ర నేతలు, కేవలం తమ వ్యక్తిగత అజెండాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనివల్ల సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని పార్టీ అంతర్గత వర్గాలు చర్చించుకుంటున్నాయి.ఏ పార్టీలోనైనా పాత వారు, కొత్తగా వచ్చిన వారి మధ్య చిన్నపాటి ఘర్షణలు సహజం. కానీ తెలంగాణ బీజేపీలో ఈ అంతరం అంతకంతకూ పెరుగుతోంది. ఇతర పార్టీల నుండి వచ్చిన సీనియర్ నేతలకు, పార్టీని నమ్ముకున్న పాత కాపులకు మధ్య సయోధ్య కుదరడం లేదు. బయటకు అందరూ నవ్వుతూ కనిపిస్తున్నా, లోపల మాత్రం ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ, ఎదుటివారిని తక్కువ చేసే ప్రయత్నాలు చేస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కవరింగ్ రాజకీయాల వల్ల పార్టీ ఎదుగుదల కుంటుపడుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణలో రాజకీయ పరిస్థితులు బీజేపీకి అనుకూలంగా ఉన్నాయని భావించి, కాషాయ తీర్థం పుచ్చుకోవాలని భావిస్తున్న పెద్ద తలకాయలు ఇప్పుడు వెనకడుగు వేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం పార్టీలో ఉన్న నేతలేనని తెలుస్తోంది. ఎవరైనా కొత్త నేతలు పార్టీలోకి వస్తామంటే, ప్రస్తుతం ఉన్న నాయకులు వారిని ప్రోత్సహించాల్సింది పోయి, "మాకే దిక్కు లేదు, మమ్మల్ని ఇక్కడ ఎవరూ గౌరవించడం లేదు, మీరు వచ్చి ఏం చేస్తారు?" అంటూ భయపెట్టి నిరుత్సాహపరుస్తున్నారట. ఈ పరిస్థితి వల్ల పార్టీలోకి రావాలనుకున్న వారు పెనం మీద నుంచి పొయ్యిలో పడటం ఎందుకని భావిస్తూ ఇతర ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు.బీజేపీలో నెలకొన్న ఈ వింత పరిస్థితికి మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఉదాహరణగా నిలుస్తున్నారు. ఆయన బీజేపీలో చేరడం ఖాయమని, కేవలం ముహూర్తం మాత్రమే బాకీ ఉందని పార్టీ నేతలే స్వయంగా ప్రచారం చేశారు. కానీ అనూహ్యంగా ఆయన కమలాన్ని కాదని గులాబీ గూటికి చేరుకున్నారు. ఆయన పార్టీ మారడానికి బీజేపీలోని అంతర్గత కుమ్ములాటలు, నాయకుల మధ్య ఉన్న విభేదాలే ప్రధాన కారణమని ఇప్పుడు పార్టీలో చర్చ మొదలైంది. ఒక సీనియర్ నేతను కూడా పార్టీలోకి ఆహ్వానించి, నిలబెట్టుకోలేని స్థితిలో తెలంగాణ బీజేపీ ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇతర రాష్ట్రాల్లో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని చేర్చుకుని, వారికి ఉన్నత పదవులు ఇచ్చి పార్టీని అధికారంలోకి తెస్తున్న హైకమాండ్ వ్యూహాలు తెలంగాణలో మాత్రం రివర్స్ అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో క్యాడర్ సిద్ధంగా ఉన్నా, నాయకుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల పార్టీకి నష్టం జరుగుతోంది. ఇప్పటికైనా అగ్ర నాయకత్వం జోక్యం చేసుకుని ఈ అంతర్గత విబేధాలను పరిష్కరించకుంటే, అధికారంలోకి రావాలన్న కల కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# బ్రాహ్మణుల్లోనే కులాంతర వివాహాలు

హైదరాబాద్, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ఇంటింటి సర్వే(సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే-2024)లో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. కులాంతర వివాహాలు ఎక్కువగా చేసిన కుటుంబాలలో బ్రాహ్మణులు అత్యధికంగా ఉన్నారని తేలింది. ఆ తర్వాత బీసీ/ఎస్సీ క్రైస్తవులు, రాజులు ఉన్నారు.కాపులు, బ్రాహ్మణులతోపాటు బీసీ-ఏలు కూడా కులాంతర వివాహాలలో ఎక్కువ వాటాతో ఉన్నారు. ఏదేమైనప్పటికీ.. వెలమ, రెడ్డి వంటి అగ్రవర్ణాలు కులాంతర వివాహాల రేటును చాలా తక్కువగా కలిగి ఉన్నాయి. ఇది రాష్ట్ర సగటు కంటే చాలా తక్కువగా ఉందని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని ఇండిపెండెంట్ ఎక్స్పర్ట్ వర్కింగ్ గ్రూప్ (ఐఈడబ్ల్యూజీ) తెలిపింది.కులాంతర వివాహాలు సామాజిక అడ్డంకులను బలహీనపరుస్తాయి. పెరుగుతున్న సామాజిక చలనశీలతను సూచిస్తాయి, ముఖ్యంగా వ్యక్తిగత ఏజెన్సీ పరంగా, మహిళలు తమ భాగస్వాములను ఎన్నుకోవడంలో ఎక్కువ స్వేచ్ఛను ఉపయోగిస్తున్నారు. కులాంతర వివాహాలతో బ్రాహ్మణులు అత్యధికంగా (12 శాతం), బీసీ-సీ, ఎస్సీ క్రైస్తవులు (9.9 శాతం), రాజులు (8.7 శాతం) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. అగ్రవర్ణాల్లో వధువుల కొరతతోనే కులాంతర వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిసింది. కులాంతర వివాహాల ప్రాబల్యం సమాజం గురించి కూడా చర్చకు దారితీస్తోంది. అధిక పట్టణీకరణ, విద్య కూడా కులాంతర వివాహాలు చేసుకోవడానికి ఓ కారణంగా ఉన్నాయి.కులాంతర వివాహాలకు ఒక ముఖ్యమైన అంశం పట్టణ నివాసం కావచ్చు అని నిపుణులు చెబుతున్నారు. 90 శాతం మంది బ్రాహ్మణులు పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని వెల్లడైంది. దీంతో వివాహంలో కుల అడ్డంకులను పెద్దగా పట్టించుకోవడం లేదు.మరోవైపు ఎస్టీ కోలాం(2.6 శాతం), బీసీ-డీ మాలి (2.6 శాతం), ఎస్టీ గోండులు (2.8 శాతం) వంటి కులాలు కులాంతర వివాహాలలో అతి తక్కువ వాటా కలిగి ఉన్నాయి. అయితే దీనికి కూడా పలు కారణాలు ఉన్నాయి. అందుకే కులాంతర వివాహాలకు సంబంధించి వీరు వెనుకబడి ఉంటున్నారు.



భౌగోళికంగా ఒంటరితనం, పట్టణాలకు దూరంగా ఉండటం, సాంప్రదాయ నిబంధనలకు కట్టుబడి ఉండటం దీనికి కారణమని తెలిపింది.రెడ్డీలు, వెలామాలతో సహా భూ యాజమాన్యంలోని ఫార్వర్డ్ కులాల మధ్య కులాంతర వివాహాల తక్కువగానే జరుగుతున్నాయి. ఆర్థిక పురోగతి, పట్టణీకరణ కొంతమందికి వివాహంలో కుల అడ్డంకులను తొలగిస్తున్నాయి. అయితే కొన్ని కులాల్లో లోతుగా పాతుకుపోయిన ఆలోచనలు, ఇతర కారణాలతో కులాంతర వివాహాలు చేసుకోవడం లేదు. 2024-25లో తెలంగాణ సామాజిక-ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల (ఎస్ఈఈపీసీ) సర్వే-2024 నిర్వహించింది. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ 15న ఈ నివేదికలను పబ్లిక్ డొమైన్‌లో విడుదల చేసింది

# కిడ్నీ సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీరు తాగుతున్నారా?



కొబ్బరి నీరు ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందరికీ తెలిసిందే. ఇది సహజంగా ఎలక్ట్రోలైట్లు, విటమిన్లు, ఖనిజ లవణాలతో సమృద్ధిగా ఉంటుంది. అయితే, మూత్రపిండాల (కిడ్నీ) సమస్యలతో బాధపడుతున్న వారు కొబ్బరి నీరు తాగడం మంచిదా అనే ప్రశ్న చలా మందిలో ఉంది. అయితే ఇది వారి ఆరోగ్య పరిస్థితిపై ఆధారపడి ఉంటుంది. కొబ్బరి నీరులో పోషక విలువలు కొబ్బరి నీరు సహజంగా పొటాషియం, సోడియం, మెగ్నీషియం, కాల్షియం, ఇతర ఖనిజ లవణాలను కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది. కొబ్బరి నీరులో తక్కువ శాతం చక్కెర , కొవ్వు ఉంటాయి, అందువల్ల ఇది ఆరోగ్యకరమైన పానీయంగా పరిగణించబడుతుంది. మూత్రపిండాల సమస్యలు కొబ్బరి నీరు శరీరాన్ని హైడ్రేట్ చేయడంలో సహాయపడుతుంది, ఇది మూత్రపిండాల్లో కణికలు ఏర్పడకుండా ఉండటానికి ఉపయోగపడుతుంది. ఇందులో నెచురల్ సిట్రేట్ ) ఉండడం వల్ల, రాళ్లు ఏర్పడే అవకాశాన్ని తగ్గిస్తుంది. ముఖ్యంగా కాల్షియం ఆక్సలేట్ రాళ్లు ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగడం వల్ల ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. అయితే మూత్రపిండాలు సరిగ్గా పనిచేయకపోతే, పొటాషియం శరీరంలో పేరుకుని, ప్రమాదకరమైన స్థాయికి చేరుకోవచ్చు. కొబ్బరి నీరులో పొటాషియం అధికంగా ఉండడం వల్ల, కొంతమంది కిడ్నీ రోగులకు ఇది మేలు కాకపోవచ్చు. హైపర్‌కలేమియా ఉన్నవారు కొబ్బరి నీరు తాగేటప్పుడు వైద్యుడి సలహా తీసుకోవడం మంచిది. క్రానిక్ కిడ్నీ డిసీజ్ : దీర్ఘకాలిక మూత్రపిండ సమస్యలతో బాధపడేవారు ద్రవ పానీయాల ) పరిమాణాన్ని నియంత్రించాలి. కొబ్బరి నీరులోని ఎలక్ట్రోలైట్లు, ముఖ్యంగా పొటాషియం అధిక స్థాయిలో ఉండడం వల్ల, అఐఆ ఉన్నవారికి ప్రతికూల ప్రభావం కలిగించే అవకాశం ఉంది. కాబట్టి, దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధితో ఉన్న వారు కొబ్బరి నీరు త్రాగే ముందు వైద్యుని సంప్రదించడం మంచిది. కొబ్బరి నీరు రక్తపోటును కొంతవరకు నియంత్రించడంలో సహాయపడుతుంది. కానీ, అధిక సోడియం లెవల్స్ ఉన్నవారు, లేదా సోడియం పరిమిత ఆహారం తీసుకోవాల్సిన అవసరం ఉన్నవారు, కొబ్బరి నీరు త్రాగేముందు జాగ్రత్తగా ఉండాలి. ఎవరికి తాగొచ్చు? ఎవరికి తాగకూడదు? చిన్నపాటి మూత్రపిండ రాళ్లు ఉన్నవారు. సాధారణ మూత్రపిండ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలనుకునేవారు. తక్కువ పొటాషియం స్థాయితో ఉన్నవారు కొబ్బరి నీరు తాగొచ్చు. అయితే హైపర్‌కలేమియా (అధిక పొటాషియం) ఉన్నవారు. క్రానిక్ కిడ్నీ డిసీజ్ ఉన్నవారు. అధిక సోడియం నియంత్రణ అవసరమైన వారు కొబ్బరి నీరు తీసుకోకపోవడమే మంచిది.' మూత్రపిండాల సమస్య ఉన్నవారు కొబ్బరి నీరు త్రాగేముందు వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకోవాలి. కొబ్బరి నీరు ఆరోగ్యకరమైనదైనా, అది కొన్ని మూత్రపిండ సమస్యలలో ప్రతికూల ప్రభావం చూపించే అవకాశం ఉంది. కాబట్టి, మీకు కిడ్నీ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉంటే, ముందుగా వైద్య నిపుణుల సలహా తీసుకుని, అవసరమైన మార్గదర్శకత్వాన్ని పాటించడం ఉత్తమం.

# పరగడుపున ఈ ఆహారాలు అస్సలే తినొద్దు... తింటే జరిగేదిదే!

చాలామంది ప్రతిరోజూ ఉదయం నిద్ర లేచిన తర్వాత పరగడుపున ఏం తినాలి? ఏం తినకూడదు? అనేది తెలుసుకోకుండా ఆహారాన్ని తీసుకుంటారు. పరగడుపున తీసుకునే ఆహారం విషయంలో కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలని వైద్యులు చెబుతున్నారు. ఒకవేళ జాగ్రత్తలు తీసుకోకుండా పరగడుపున ఏది పడితే అది తింటే అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. ఇక పరగడుపున మనం తినకూడని ఆహార పదార్థాలు ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. పరగడుపున ఈ ఆహారాలు తీసుకోకూడదు పరగడుపున మనం ఉప్పు, కారం, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు. ఖాళీ కడుపుతో ఈ ఆహారాన్ని తీసుకుంటే గుండెల్లో మంటగా ఉంటుంది. ఇది మనకు ఇబ్బందిని కలిగిస్తుంది. ఇక పరగడుపున మనం పుల్లగా ఉండే సిట్రస్ ఫ్రూట్స్ తీసుకోకూడదు. నిమ్మ, నారింజ వంటి వాటిని పరగడుపున తీసుకుంటే గ్యాస్ సమస్య వస్తుంది. ఉదయాన్నే ఈ పానీయాలు తీసుకోకూడదు చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీలు తాగుతూ ఉంటారు. పరగడుపున ఎలాంటి ఆహారం తినకుండా కాఫీ, టీలు తాగితే కూడా ఎసిడిటీ సమస్య వస్తుంది. అది మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో పొరపాటున కూడా శీతల పానీయాలు తీసుకోకూడదు. వీటిలో ఉండే కార్బోనేటెడ్ గ్యాస్ మనకు పొట్ట ఉబ్బరాన్ని కలిగిస్తుంది. తీపి పదార్థాలు పరగడుపున తింటే జరిగేదిదే పరగడుపున పొరపాటున కూడా తీపి పదార్థాలు తీసుకోకూడదు. ఒకవేళ ఉదయం ఆహారంలో భాగంగా మొదట తీపి పదార్థాలు తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు వేగంగా పెరుగుతాయి జీర్ణాశయంలో ఉన్న ఎంజైములు బద్ధకంగా మారుతాయి. దీనివల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి. పరగడుపున నూనెలో డీప్ ఫ్రై చేసిన ఆహారాలను తినకూడదు. వీటిని తినడం వల్ల నీళ్లను ఎక్కువ తాగడంతో పాటు పొట్ట ఉబ్బరం, అజీర్తి వంటి సమస్యలు ఇబ్బంది పెడతాయి. నిల్వ పచ్చళ్ళు, పాలపదార్థాలు తింటున్నారా? పొరబాటున కూడా పరగడుపున టిఫిన్ తో పాటు నిల్వపచ్చళ్ళు తీసుకోకూడదు. పచ్చళ్ళలో ఉప్పు, కారం, నూనె ఎక్కువగా ఉంటాయి. ఇవి మనకు గ్యాస్ సమస్యను, అజీర్తిని కలిగిస్తాయి. ఇక పరగడుపున చీజ్ వంటి ఆహారాలను తీసుకోకూడదు. చీజ్ లో కొవ్వు ఎక్కువగా ఉండటం వల్ల ఈ పాలపదార్థాలు పరగడుపున తింటే అజీర్తి సమస్య వస్తుంది. పరగడుపున పొరపాటున కూడా ఐస్క్రీమ్ ని తీసుకోకూడదు. ఇది మన జీర్ణవ్యవస్థను ఇబ్బంది పెడుతుంది. ఆరోగ్య సమస్యలు వచ్చే చాన్స్... జాగ్రత్త ఫ్యాట్ తో పాటు చక్కర శాతాన్ని ఇందులో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఇది మనకు అనారోగ్య సమస్యలను కలిగిస్తుంది. ఇక పరగడుపున చాలా లైట్ గా సులభంగా జీర్ణమయ్యే ఆహారాలను తీసుకోవడం మంచిది. పైన పేర్కొన్న ఆహారాలను తీసుకొని అనారోగ్యాల బారిన పడకుండా ఎంపిక చేసుకున్న ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండడం మంచిది.



# బరువు పెరగటానికి ప్రధాన కారణాలివే.. తెలుసుకోండి!

చాలామంది ప్రస్తుతం అధిక బరువు సమస్యను ఎదుర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా ఊబకాయ బాధితులు పెరిగిపోయారు. అసలు బరువు పెరగడానికి కారణాలేంటి? బాగా ఆహారం తీసుకునే వారే బరువు పెరుగుతారా? ఏ కారణాలతో బరువు పెరుగుతారు అన్నది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. మన జీవనశైలి కారణంగా మనం బరువు పెరిగే అవకాశం ఉంటుంది. బరువు పెరగటానికి కారణాలివే తగినంత వ్యాయామాన్ని చేయకపోవడం, తక్కువ కదలడం, నిద్రలేమి వంటి సమస్యలు మన బరువు పెరగడానికి కారణాలుగా మారుతున్నాయి. అంతేకాదు అతిగా తినడం, తినకూడని ఆహారాలను తినడం, కార్బోహైడ్రేడ్లు ఎక్కువగా ఉన్న ఆహారాలను తినడం, శరీరానికి కావాల్సిన ప్రోటీన్ తీసుకోకపోవడం, కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాన్ని తినడం మన బరువు పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. హార్మోన్ మార్పులు కారణంగా బరువు పెరిగే అవకాశం కొంతమందిలో వయస్సు పెరిగే కొద్దీ జీవక్రియ మందగించి బరువు పెరిగే అవకాశం ఉంటుంది. ఇక మరికొంతమందిలో హార్మోన్ మార్పులు కారణంగా బరువు పెరిగే అవకాశం ఉంటుంది. హార్మోన్ల మార్పులు, పాలిసిస్టిక్ ఒవేరియన్ సిండ్రోమ్, హైపోథైరాయిడిజం వంటివి కూడా మన బరువు పెరగడానికి ప్రధానమైన కారణాలుగా చెప్పవచ్చు. సరిగా నిద్ర లేకపోవడం మన బరువును అమాంతం పెంచేస్తుంది. మానసిక స్థితి కూడా బరువు పెరగటానికి కారణం విపరీతమైన పని ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, నిరాశ వంటి మానసిక స్థితి కూడా మన బరువు పెరగడానికి కారణమవుతుంది. కొంతమందిలో జెనెటికల్ గా తల్లిదండ్రుల నుండి వచ్చాయి. ఈ లక్షణాలు కూడా బరువు పెరగడానికి కారణం అవుతుంది. జనన నియంత్రణ మాత్రలు వేసుకోవడం, కార్టికో స్టెరాయిడ్స్ ను ఉపయోగించడం కూడా మన బరువు పెరగడానికి కారణం అవుతుంది. మధుమేహం చికిత్సకు ఉపయోగించే కొన్ని మందులు కూడా మన బరువును అమాంతం పెంచేస్తాయి. ఎక్కువ క్యాలరీలు తీసుకునే వారిలో మాత్రమే కాదు డైట్ పేరుతో సరైన సమయానికి సరైన ఆహారాన్ని తీసుకోని వారిలో కూడా బరువు పెరిగే సమస్య ఉంటుంది. శరీరంలోని అంతర్లీన పరిస్థితులు, శారీరక మార్పులు వంటివి కూడా బరువు పెరగడానికి కారణం అవుతాయి.



# షుగర్ పేషెంట్లు డయాబెటిస్ నియంత్రణ కోసం రోజుకు ఎన్నిసార్లు తినాలి? ఎలా తినాలి?



ప్రస్తుత సమాజంలో చాలామంది టైప్ టు డయాబెటిస్ తో, లేదా ప్రీ డయాబెటిస్ తో బాధపడుతున్నారు. ఇక అటువంటివారు డయాబెటిస్ ని కంట్రోల్ చేసుకోవడానికి ఎటువంటి ఆహారపు అలవాట్లు చేసుకోవాలి. రోజుకు వారు ఎన్ని సార్లు తినాలి? ఎలా తింటే వీరు రక్తంలో గ్లూకోజ్ లెవెల్స్ ను కంట్రోల్ లో ఉంచగలుగుతారు? అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. ఆహారం ఇలా తీసుకుంటే షుగర్ కంట్రోల్ టైప్ టు డయాబెటిస్ తో బాధపడేవారు ప్రతిరోజు మూడుసార్లకు మించి ఆహారాన్ని తీసుకోవడంతో రక్తంలో షుగర్ లెవెల్స్ అదుపులో ఉన్నట్టు నిపుణులు చెబుతున్నారు. 2018లో డయాబెటిస్ మరియు మెటబాలిజం జర్నల్ లో ప్రచురితమైన ఈటింగ్ త్రీ టైమ్స్ మే నాట్ బి ఆప్టిమల్ ఫర్ ఎవ్రీవన్ విత్ డయాబెటిస్ ఏ ర్యాండమైజ్డ్ కంట్రోల్డ్ ట్రయల్ అనే అధ్యయనంలో ఈ విషయం నిరూపించబడింది. డయాబెటిస్ బాధితులపై జరిపిన అధ్యయనం ఇక ఈ నేపథ్యంలో డయాబెటిస్ బాధితులు ఎన్ని సార్లు తినాలి అనే విషయాన్ని గమనించినట్లయితే..ప్రీ డయాబెటిస్, టైప్ టు డయాబెటిస్ తో బాధపడేవారు ఊబకాయం ఉన్న 47 మందిని మూడు పూటలా ఆహారం పెట్టి 12 వారాలపాటు గమనించారు. మరికొందరిని ఆరు పూటలా ఆహారం తినమని సూచించారు. ఇలా 24 వారాలపాటు వీరందరిని పరిశీలించగా ఎక్కువసార్లు తిన్నవారిలో మెరుగైన ఫలితాలు కనిపించినట్టు తేలింది. ఆరుసార్లు తిన్నవారిలో ఆకలి తగ్గినట్టు గమనించిన పరిశోధకులు అందరూ ఒకే మోతాదులో కేలరీలు తీసుకున్న క్రమంలో వీరి చెక్కర స్థాయిలు కూడా అదుపులో ఉన్నట్టు, మూడుసార్లు తిన్నవారితో పోలిస్తే ఆరుసార్లు తిన్నవారిలో ఆకలి వేయడం తగ్గిందని అధ్యయనంలో తేల్చారు. ఇలా తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు ఆహారం తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు కంట్రోల్ లో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.

# నత్తనడకన దిండి– చించినాడ పనులు



రాజమండ్రి, ఏప్రిల్ 18, ఉభయ గోదావరి జిల్లాలను కలుపుతూ దిండి–చించినాడ గ్రామాల వద్ద వశిష్ట నదీపాయపై నిర్మించిన వంతెన మరమ్మత్తుల పేరుతో భారీవాహనాలను నిషేదించి ఇప్పటికి 8నెలలు పూర్తి కావస్తుంది.. అయినప్పటికీ మరమ్మత్తు పనులు నత్తనడకన సాగుతుండడం ప్రజలకు తీవ్ర ఆగ్రహాన్ని కలిగిస్తోంది. అటు పశ్చిమగోదావరి జిల్లా, నర్సాపురం జిల్లాలు ఇటు అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఉన్న విద్యాసంస్థలకు అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రతీరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వంతెన మరమ్మత్తులతో అటుగా విద్యార్థులు నడిచి వచ్చి వెళుతుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.. ఇదే తరహాలో ఉద్యోగులు కూడా అనేక సమస్యలు లేవనెత్తుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు అయితే వర్ణణాతీతం అంటున్నారు..బస్సు ఎక్కి దిండి వద్ద దిగాల్సి వస్తుందని, మళ్లీ వంతెన పొడవునా నడిచి చించినాడ వెళ్లి అక్కడ బస్సు ఎక్కి వెళ్లాల్సి వస్తోందని, అదేవిధంగా సాయంత్రం తిరిగి ఇళ్లకు వస్తున్నప్పుడు చించినాడ వరకు బస్సులో వచ్చి అక్కడి నుంచి వంతెన పక్క నుంచి నడిచి మళ్లీ దిండి వద్ద బస్సు ఎక్కాల్సి వస్తోందని తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.. ఇదే తరహాలో కళాశాల బస్సులు వంతెనకు ఇరువైపులా ఉంచి విద్యార్థులను తరలిస్తున్నాయి. ఈమధ్యలో వంతెన పొడవునా నడుచుకుంటూ వెళ్లడం వల్ల రెండు గంటల సమయం వృథా అవుతుందంటున్నారు విద్యార్థులు.. దీని వల్ల అలసిపోవడం, కాలేజీలకు లేట్ అవ్వడం జరుగుతుందని వివరిస్తున్నారు. ఈప్రభావం చదువుపై పడుతుందంటున్నారు...దిండి – చించినాడ వద్ద 216 జాతీయ రహదారిని కలుపుతూ ఉన్న ఈ వంతెన ప్రాధాన్యత అంతా ఇంతా కాదు.. కేవలం పశ్చిమగోదావరి జిల్లాల ప్రజలే కాదు విశాఖపట్నం నుంచి వచ్చిన వారు నర్సాపురం, మచిలీపట్నం, విజయవాడ వెళ్లేవారు ఎక్కువగా ఈ రహదారి ద్వారా ప్రయాణాలు సాగిస్తుంటారు.. ట్రక్కులు, గూడ్స్ వెహికల్స్ కూడా ఈ రోడ్డు ద్వారా ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి.. ఈ వంతెన మమ్మత్తులతో భారీ వాహనాలకు బ్రేక్ వేశామని చెబుతున్నా రాత్రి వేళల్లో అయితే లైట్ మోటారు వెహికల్స్‌కు కూడా అనుమతులు నిలిపివేయడం ప్రజల ఆగ్రహానికి కారణం అవుతుంది..2025 ఆగస్టు 25 నుంచి మరమ్మత్తుల నిమిత్తం ఈ వంతెనపై నిషేధం విధించారు. అప్పటి నుంచి బస్సులు, లారీలు, ఐషర్ వేన్‌లు ఇలా కొంచెం పెద్ద వాహనాలు ఏవీ రాకుండా నిషేదించారు. కార్లు, ఆటోలు, బైక్‌లకు మాత్రమే వెళ్లేందుకు అవకాశం కల్పించడగా వాటికి కూడా రాత్రివేళల్లో నిలిపివేయడంతో ఈ వంతెనపై ఏ సమయంలో ఎటువంటి ఆటంకం కలుగుతుందో తెలియని ప్రజలు ఈ మార్గంలో ప్రయాణాలు విరమించుకుంటున్నారు.. ఇప్పటివరకు వంతెన బేరింగ్ పనులు చేస్తోన్న సదరు కాంట్రాక్ట్ సంస్థ ఈ పనులను కూడా నత్తనడకన చేస్తుందని విమర్శిస్తున్నారు. మరో నెల రోజులు పైబడి వంతెన మరమ్మత్తులు జరుగుతాయని అధికారులు చెబుతున్నప్పటికీ మరో మూడు నెలల వరకు ఇదే పరిస్థితి కొనసాగేలా ఉందని ప్రజలు పెదవి విరుస్తున్నారువంతెన బేరింగ్ మరమ్మత్తు పనులు నిర్వహించే క్రమంలో వంతెన పిల్లర్ల వద్ద ఉన్న జాయింట్‌పై ఒత్తిడి పడకుండా పైన ఒక తాత్కాలిక ఇనుప వంతెన అమర్చుతున్నారు. ఇది ర్యాంప్ లు కలిగి ఎత్తుగా ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయంటున్నారు. తాత్కాలిక వంతెన ర్యాంపు ఎక్కించే క్రమంలో కార్లు వేగాన్ని పెంచి వెళ్లడం వల్ల పలు ప్రమాదాలు జరిగాయని చెబుతున్నారు. 2025 ఆగస్టు 25 నుంచి ప్రారంభమైన ఈ మరమ్మత్తు పనులు పొడిగిస్తూ వస్తున్నారు.. ఇప్పటికే మూడు సార్ల వంతెనపై నిషేదాజ్ఞలు పొడిగిస్తూ వచ్చిన సదరు కాంట్రాక్టు సంస్థకు ఇచ్చిన గడువు పూర్తి అయినా ఇప్పటికీ మరమ్మత్తులు పూర్తి చేయలేని దుస్థితి కనిపిస్తోంది. కొన్ని రోజుల్లోనే పూర్తి స్థాయిలో వంతెన మరమ్మత్తులు పూర్తిచేస్తామని చెప్పుకొస్తున్నా అక్కడ పరిస్థితులను బట్టి మరో మూడు నెలలు పాటు కాలయాపన చేసేలా ఉన్నారని ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# బీటెక్ రవికి తిప్పలు తప్పవా

కడప, ఏప్రిల్ 18, పులివెందుల నియోజకవర్గం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ముఖ్యంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కు ఇది బలమైన కోటగా పేరుంది. ఈ నేపథ్యంలో ఈ నియోజకవర్గంలో జగన్‌ను ఓడించడం తెలుగుదేశం పార్టీ ప్రధాన లక్ష్యంగా పెట్టుకుంది. గత ఎన్నికల సమయంలోనే ఈ సీటుపై టిడిపి గట్టిగా దృష్టి పెట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ప్రభావం తగ్గినా, పులివెందులలో మాత్రం జగన్‌కు ఉన్న పట్టు స్పష్టంగా కనిపించింది.వచ్చే ఎన్నికల నాటికి ఎట్టి పరిస్థితుల్లోనైనా ఈ నియోజకవర్గాన్ని తమవైపు తిప్పుకోవాలని టిడిపి వ్యూహాలు రచిస్తోంది. దీనికోసం అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేస్తోంది. ముఖ్యంగా రైతులకు సాగునీటి సదుపాయం అందించేందుకు చర్యలు చేపడుతోంది. పట్టిసీమ ప్రాజెక్ట్ నుంచి కూడా నీటిని పులివెందులకు చేరవేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. అదే సమయంలో ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మెరుగైన సేవలు అందించాలని ప్రభుత్వం కృషి చేస్తోంది.అయితే, కేవలం అభివృద్ధి పనులు మాత్రమే సరిపోవని టిడిపి నాయకత్వం భావిస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాన్ని పెంచడం, కార్యకర్తలను చైతన్యపరచడం కూడా అంతే ముఖ్యమని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే పులివెందుల ఇన్చార్జ్‌గా ఉన్న బీటెక్ రవి ( పనితీరుపై పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల కడప పర్యటనలో ఆయన రవికి నేరుగా సూచనలు చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇంకా, మంత్రి నారా లోకేష్కూడా పార్టీ పరిస్థితిని సమీక్షించినప్పుడు పులివెందులలో పనితీరు ఆశించినంతగా లేదని ప్రస్తావించినట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకున్నప్పుడు ఇప్పటి నుంచే కఠినంగా శ్రమించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి కొంతమేర విజయం సాధించింది. ముఖ్యంగా ఎంపీటీసీ ఎన్నికల్లో గెలుపు సాధించడం, అలాగే బీటెక్ రవి కుటుంబానికి చెందిన అభ్యర్థి విజయం సాధించడం పార్టీకి కొంత ఉత్సాహాన్ని ఇచ్చింది. దీంతో నియోజకవర్గంలో తమ ప్రభావం పెరుగుతోందని టిడిపి భావిస్తోంది.అయితే, పులివెందులలో వైఎస్ కుటుంబానికి ఉన్న అనుబంధం, అభిమాన వర్గం ఇప్పటికీ బలంగా ఉంది. ఈ కారణంగా అక్కడ రాజకీయ పరిస్థితులు అంత సులభంగా మారే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అందుకే నిరంతరం ప్రజల మధ్య ఉండటం, పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేయడం అత్యంత కీలకమని టిడిపి నాయకత్వం భావిస్తోంది. ఈ పరిస్థితుల్లో బీటెక్ రవి మరింత చురుకుగా వ్యవహరించి పార్టీ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. లేకపోతే వచ్చే ఎన్నికల్లో విజయం సాధించడం కష్టసాధ్యమవుతుందని రాజకీయ పరిశీలకులు సూచిస్తున్నారు. పులివెందులలో వచ్చే ఎన్నికలు ఆసక్తికర పోరాటానికి వేదిక కావడం ఖాయం అని చెప్పవచ్చు.

# సీ ఓటర్ సర్వే..

## పుంజుకోని వైసీపీ.. ఏకపక్షంగా కూటమి

విజయవాడ, ఏప్రిల్ 18, (న్యూస్ పల్స్)ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చెబుతోంది. జగన్మోహన్ రెడ్డి సైతం పదేపదే ఇదే హెచ్చరిస్తూ వస్తున్నారు. ఇప్పటికే రెండేళ్లు గడిచిపోయిందని.. మరో రెండేళ్లు ఇట్టే గడిచిపోతే వచ్చేది మన ప్రభుత్వమేనని గట్టిగానే చెబుతూ వచ్చారు. అయితే గతంలోనే వై నాట్ 175 అన్న నినాదం ఇచ్చి చతికిల పడింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అందుకే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి మరోసారి తమదే అధికారం అని చెబుతున్న మాటలు విశ్వాసానికి నోచుకోలేదు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని తెలుసుకొని మాట్లాడుతున్నారా? లేకుంటే అతి ధీమాతో ఈ వ్యాఖ్యలు చేస్తున్నారా? అనే అనుమానాలు ఉన్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే సి ఓటర్ సంస్థ చేపట్టిన సర్వే సంచలనంగా మారింది.ఏపీలో ప్రభుత్వ పనితీరు, ప్రతిపక్షం పనితీరుపై గత కొద్దిరోజులుగా సర్వే చేసింది సి ఓటర్ . దానికి సంబంధించిన ఫలితాలు మైండ్ బ్లాక్ అయ్యేలా ఉన్నాయి. 2014లో తెలుగుదేశం కూటమి ఘన విజయం సాధించింది. జనసేన, బిజెపితో కలిసి పోటీ చేసింది. అప్పుడు ఆ మూడు పార్టీలకు 55.3% ఓట్లు వచ్చాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 39.4% ఓట్లు వచ్చాయి. ఎన్నికలు జరిగి దాదాపు రెండేళ్లు అవుతోంది. అయితే కూటమి ప్రభుత్వం పట్ల ప్రజా వ్యతిరేకత ప్రారంభం అయింది అని జగన్మోహన్ రెడ్డి తో పాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు గట్టిగానే చెబుతున్నారు. ప్రజల్లోకి ఆ ప్రచారాన్ని బలంగా తీసుకెళ్తున్నారు.అయితే తాజాగా సి ఓటర్ సంస్థ ఒక సంచలన సర్వేను బయటపెట్టింది. ఇప్పటికి ఇప్పుడు ఎన్నికలు పెడితే కూటమి పార్టీలకు గతం కంటే ఎక్కువ ఓట్లు వస్తాయి అన్నది దీని సారాంశం. ఏకంగా 57.5% ఓట్లను కూటమి దక్కించుకుంటుందన్నది ఈ సర్వేలో తేలింది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి 37.5% మాత్రమే ఓట్లు దక్కుతాయని తేల్చింది. ఈ లెక్కన ఆ కూటమి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య ఏకంగా 20% ఓట్ల తేడా కనిపిస్తోంది. అయితే మధ్యలో బిజెపి లేకపోయినా.. టిడిపి, జనసేన కలిసి పోటీ చేస్తే ఆ కూటమిదే విజయం అని తేల్చింది ఈ సర్వే. ప్రస్తుతం ఈ సర్వే ను వైరల్ చేస్తున్నారు టిడిపి కూటమి శ్రేణులు.అయితే ఈ సర్వే చెప్పిందని కాదు కానీ.. తెలుగుదేశం పార్టీతో జనసేన కొనసాగిన క్రమంలో ఆకూటమిదే విజయం అన్న విశ్లేషణలు ఉన్నాయి. ఇదివరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ నేత విజయసాయిరెడ్డి ఇదే విషయాన్ని చెప్పారు.. తాజాగా విశ్లేషకుడు ముసుగులో ఉండవల్లి అరుణ్ కుమార్ కూడా దీనినే తేల్చారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంకు కరిగిపోయింది. ఆ పార్టీకి సరైన నాయకత్వం కూడా లేదు. చాలా నియోజకవర్గాల్లో ఆ పార్టీ పరిస్థితి దయనీయంగా ఉంది. ఇప్పుడు తాజా సర్వేలో అదే స్పష్టమైంది. చూడాలి మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో..

# టార్గెట్ వైసీపీ...

కాకినాడ, ఏప్రిల్ 18, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తమ పార్టీ నేతలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగా ఎదుర్కోవాలని సూచించారు. పార్టీ అధికార ప్రతినిధులతో సమావేశమైన పవన్ వారికి కీలక సూచనలు చేశారు. తాను ఒక్కడినే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవడం కాదు.. మిగతా పార్టీ నేతలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని కూడా సూచనలు చేశారు. క్షేత్రస్థాయిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విమర్శలకు ఇచ్చి పడేయాలని సూచించారు. అలాగని ఇష్టారాజ్యంగా మాట్లాడవద్దని.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతల మాదిరిగా బూతులు వద్దని సూచించారు. కూటమి పార్టీలో జనసేన ఒక భాగస్వామ్యం అని.. కూటమి అంటే ఒక్క తెలుగుదేశం మాత్రమే కాదు అని.. అందుకే ప్రభుత్వం పై విమర్శలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తే గట్టిగానే బదులు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ తాజాగా ఆదేశాలు ఇవ్వడం విశేషం.కూటమి అధికారంలోకి వచ్చి రెండేళు అవుతోంది. మరో మూడేళ్ల గడువు మాత్రమే ఉంది. కూటమి కలిసికట్టుగా 15 సంవత్సరాలు పాటు ఉండాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. అయితే జనసేనలో పవన్ ఒక్కరే మాట్లాడుతున్నారన్న విమర్శ ఉంది. పైగా కూటమిలో జనసేన నేతలు అంత కంఫర్ట్ గా లేరన్న కామెంట్స్ కూడా ఉన్నాయి. వాటిని ఎప్పటికప్పుడు చెక్ చెబుతూ వచ్చారు పవన్ కళ్యాణ్. కనీస స్థాయిలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఛాన్స్ ఇవ్వదలుచుకోలేదు. ముఖ్యంగా రెండు పార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేయని ప్రయత్నం లేదు. జనసేన నేతలతోనే ఈ ప్రయోగాలు చేసి విఫలమైంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.

# యువనాయకత్వం...

విజయవాడ, ఏప్రిల్ 18, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇటీవల వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. కూటమికి నాయకత్వం వహిస్తున్న తెలుగుదేశం పార్టీ తన వ్యూహాలను క్రమబద్ధంగా అమలు చేస్తూ ముందుకు సాగుతోంది. చాలా కాలంగా ఎదురుచూస్తున్న పార్టీ జాతీయ ,రాష్ట్ర కమిటీలను తాజాగా ప్రకటించడం ద్వారా కీలక నిర్ణయాన్ని తీసుకుంది. ఈ ప్రక్రియలో నారా లోకేష్ కి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు ఇవ్వడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.ఇప్పటికే గత మహానాడు సమయంలో లోకేష్‌కు ఈ బాధ్యతలు ఇవ్వవచ్చని చర్చలు జరిగినా, ఈసారి మహానాడు ముందుగానే అధికారికంగా ప్రకటించడం గమనార్హం. దీంతో పార్టీ వ్యవహారాలపై లోకేష్‌కు మరింత పట్టు వచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈసారి మహానాడు సమావేశంలో ఆయన కొత్త హోదాలో పాల్గొనడం ద్వారా పార్టీపై తన ప్రభావాన్ని మరింత పెంచుకునే అవకాశముంది.ఇక జూన్ నెలలో టీడీపీ కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోనుండటం కూడా కీలక అంశంగా మారింది. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణ పై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. సరైన సమయం చూసుకుని ఈ మార్పులు చేపట్టే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పార్టీ కమిటీలలో చేసిన మార్పుల మాదిరిగానే, ప్రభుత్వం లో కూడా కొత్త వారికి ప్రాధాన్యత ఇవ్వాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది.ప్రస్తుతం కూటమి మంత్రివర్గంలో ఇప్పటికే కొత్తవారికి కొంత ప్రాధాన్యత ఉన్నప్పటికీ, రాబోయే మార్పుల్లో మరింత చురుకుగా పనిచేసే నాయకులను తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ప్రజల్లో ప్రభుత్వ కార్యక్రమాలను బలంగా ప్రచారం చేయగలిగే నాయకులను ఎంపిక చేయడం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. పనితీరు ఆధారంగా కొంతమంది సీనియర్ మంత్రులకు మార్పులు జరిగే అవకాశమూ ఉన్నట్లు సమాచారం. పార్టీ పదవులైనా, ప్రభుత్వ పదవులైనా యువతకు, కొత్తవారికి అవకాశాలు పెరుగుతున్నాయని అందరూ భావిస్తున్నారు. లోకేష్ తనదైన శైలిలో పార్టీపై ముద్ర వేసిన నేపథ్యంలో, ప్రభుత్వంలో కూడా మార్పులు జరిగితే తన దృక్పథాన్ని ప్రతిబింబించేలా నిర్ణయాలు తీసుకునే అవకాశముందని విశ్లేషిస్తున్నారు.అయితే ఈ మంత్రి వర్గ విస్తరణ ఎంత పెద్ద స్థాయిలో జరుగుతుందన్నది మాత్రం ఇంకా స్పష్టంగా తెలియాల్సి ఉంది. చిన్న మార్పులు మాత్రమే చేసి ముగిస్తారా, లేక పెద్ద ఎత్తున వ్యూహరచన చేస్తారా అన్నదానిపై ఆసక్తి నెలకొంది. గతంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయాల మాదిరిగా మొత్తం మంత్రివర్గాన్ని మార్చే అవకాశం తక్కువగా కనిపిస్తోంది. పరిమిత మార్పులతోనే ప్రభుత్వం ముందుకు సాగుతుందని భావిస్తున్నారు. మొత్తంగా చూస్తే, పార్టీ కమిటీల ప్రకటనతో టీడీపీ కొత్త దశలోకి అడుగుపెట్టినట్లు కనిపిస్తోంది. ఇప్పుడు అందరి దృష్టి మంత్రి వర్గ విస్తరణపై నిలిచింది. ఈ మార్పులు ఎలా ఉంటాయి, ఎప్పుడు జరుగుతాయి అన్నదే రాబోయే రోజుల్లో ఆసక్తికర అంశంగా మారనుంది.

# కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ

శ్రీకాకుళం, ఏప్రిల్ 18, శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాల అన్వేషణ ప్రక్రియ మొదలైంది. నిపుణుల నియామకాలు, మౌలిక సదుపాయాల కల్పన పూర్తయ్యింది. విశాఖలోని కింగ్ జార్జ్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాలతో ప్రత్యేకంగా ల్యాబ్ ను ఏర్పాటు చేశారు. ఉద్దాన ప్రాంత వాసుల నుంచి వ్యాధుల రాకకు కారణాలపై రక్త నమూనాలను సేకరిస్తున్నారు.కిడ్నీ వ్యాధుల బారినపడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించేలా మూత్ర నమూనాల పరీక్షలో 'బయో మార్కర్స్' విధానాన్ని ఈ సారి కొత్తగా అమలు చేస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన ప్రశ్నావళి ద్వారా స్థానికుల నుంచి సమాధానాలు రాబడుతున్నారు. ఇప్పటివరకు ఉద్దాన ప్రాంతంలో తీసుకున్న చర్యల గురించి పరిశోధన బృందం సభ్యులు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు.ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధులు అధికంగా ఉన్నందున వాటి మూలాలు కనుగొనేందుకు గతేడాది నవంబరులో ఇండియన్ కౌన్సెల్ అఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్–డిపార్టుమెంట్ అఫ్ హెల్త్ రీసెర్చ్ విభాగం) మూడేళ్ల కాలపరిమితితో ప్రత్యేకంగా రూ.6.2 కోట్లను గ్రాంటు రూపంలో ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ మేరకు ఐసిఎంఆర్ సానుకూలంగా స్పందించింది. సీనియర్ నెఫ్రాలజిస్ట్ ప్రొఫెసర్ తాతపూడి రవిరాజు మెంటార్‌గా ఆంధ్ర వైద్య కళాశాల నెఫ్రాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రసాద్ ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్‌గా పరిశోధన ప్రారంభమైంది.శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో ప్రత్యేకంగా ఏర్పడిన బృందం ఉద్దాన ప్రాంత స్థానికులను కలుసుకుంటోంది. ఇప్పటివరకు సుమారు 1,500 మంది నుంచి రక్త, మూత్ర నమూనాలను సేకరించింది. వీటిని పలాసలోని కిడ్నీ రీసెర్చ్ కేంద్రంలో తొలుత భద్రపరిచి, ఆ తర్వాత తగిన జాగ్రత్తలతో కేజీహెచ్ లో ఉన్న ల్యాబ్ కు తరలిస్తున్నారు.ఐసీఎంఆర్ ఆమోదం తెలిపిన మేరకు విశాఖ కేజీహెచ్ లో సెంట్రిఫ్యూజ్ లు, డీప్ ఫ్రీజర్లు, శాంపిల్ స్టోరేజీ సిస్టమ్స్, అనలిటికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫీల్డ్ శాంపిలింగ్ కిట్లు ఈ ల్యాబ్ లు ఉన్నాయి. సుమారు రూ.80 లక్షలతో కొనుగోలుచేసిన అత్యాధునిక పరికరాలు/ యంత్రాలను బయో సేఫ్టీ ప్రమాణాలకు ల్యాబ్ లో ఏర్పాటయ్యాయి.బయో మార్కర్స్ టెస్టింగ్ ద్వారా కిడ్నీ బాధితులను ప్రాథమిక దశలోనే అతి త్వరగా గుర్తించేందుకు వీలుందని మెంటార్ డాక్టర్ రవిరాజ్, ప్రిన్సిపల్ ఇన్విస్టిగేటర్ డాక్టర్ జి. ప్రసాద్ వెల్లడించారు. మూత్ర నమూనాలను 'బయో మార్కర్ విధానంలో పరీక్షించడంవల్ల రానున్న మూడు, నాలుగు సంవత్సరాల్లో కిడ్నీ వ్యాధుల బారినపడేందుకు అవకాశం ఉన్నట్లయితే సూక్ష్మ స్థాయిలో తెలిసిపోతుందని వివరించారు.కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మూకుమ్మడిగా ఇటువంటి పరీక్షలు చేయడం ఇదే తొలిసారి అని చెప్పారు. మూత్ర నమూనాల సేకరణలో బాధితుల కుటుంబ నేపథ్యం, ఇతర అంశాలను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఈ ఈ పరీక్షల ద్వారా రానున్న మూడు, నాలుగేళ్లలో కిడ్నీ సమస్య వచ్చే అవకాశం ఉందా? లేదా? వస్తే ఏ స్థాయిలో వచ్చేందుకు అవకాశాలున్నాయి? అన్న వాటిపై స్పష్టత వస్తుందని వైద్యులు వెల్లడించారు.ఈ ఫలితాల ఆధారంగా రోగులు తగిన జాగ్రత్తలతో వ్యవహరించేందుకు, వైద్యాన్ని అందించేందుకు సులువవుతుందని తెలిపారు. దీనివల్ల వ్యాధి ముదరకుండా... కిడ్నీలు చెడిపోకుండా ఉండేందుకు వీలుంది. ఆర్ఎన్సీ సీక్వెన్సింగ్ విధానంలో జన్యుపరమైన పరీక్షలు కూడా ఈ పరిశోధనలో భాగంగా చేస్తామని తెలిపారు.

# కిలారు రాజేష్ కు ఎందుకంత ప్రాధాన్యం

విజయవాడ, ఏప్రిల్ 18,రాజకీయాలలో అవసరాలు మాత్రమే ఉంటాయి. ఎప్పటికీ అయ్యేది ప్రస్తుతమో అనే సామెత తీరుగానే అవి సాగిపోతుంటాయి. కానీ కొంతమంది వీటికి విరుద్ధంగా ఉంటారు. అవసరాలు కాకుండా ఆత్మీయత అనే ధోరణిలో పని చేస్తుంటారు. నాది అని కాకుండా.. మనది అనే కోణంలో అడుగులు వేస్తుంటారు. స్నేహం కోసం చివరికి తమను తాము కూడా లెక్క చేయరు. అటువంటివారు ఎటువంటి గుర్తింపును కోరుకోరు. ఎక్కడో మూలన ఉండిపోతారు. కానీ వెలుగులోకి వస్తే మాత్రం ఉదయించే సూర్యుడు కంటే ఎక్కువగా ప్రజ్వలిస్తుంటారు. ఈ ఉపమానం ఈ నాయకుడికి నూటికి నూరు శాతం సరిపోతుంది. ఆయన ఎవరు.. ఎందుకింత చర్చ జరుగుతోంది.. అనే ప్రశ్నలకు సమాధానం ఈ కథనం.ఆయన పేరు కిలారు రాజేష్. తెలుగుదేశం పార్టీలో జనరల్ సెక్రెటరీగా నియమితులయ్యారు. సాధారణంగా ఈ స్థాయికి రావాలంటే తెలుగుదేశం పార్టీలో చాలా కష్టపడాలి. చిన్న వయసులోనే ఆయనకు ఈ పదవి రావడం ఒకరకంగా వరమైతే.. ఆయన పడిన కష్టానికి లభించిన గౌరవం. నారా లోకేష్, కిలారు రాజేష్ మధ్య బలమైన స్నేహం ఉంది. వీరిద్దరూ ఒకే స్కూల్లో చదువుకున్నారు. అలా ఏర్పడిన స్నేహం చివరికి రాజకీయాలకు దారితీసింది. రాజకీయాలలో కూడా నాలా లోకేష్ కు నమ్మిన బంటుగా కిలారు రాజేష్ ను ఆవిర్భవించేలా చేసింది.2012లో తెలుగుదేశం పార్టీలో చేరారు రాజేష్. అప్పటికి ఇంకా తెలుగుదేశం పార్టీ అధికారం లో లేదు. తెలంగాణ ఉద్యమం వల్ల ప్రత్యేకమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నది. ఇలాంటి స్థితిలో పార్టీలో ప్రవేశించిన రాజేష్.. నారా లోకేష్ కు నమ్మిన బంటుగా మారిపోయారు. 2014లో ఏపీలో తెలుగుదేశం అధికారంలోకి రావడంలో రాజేష్ కీలకపాత్ర పోషించారు. ముఖ్యంగా యువతను పార్టీకి దగ్గరగా చేశారు. నారా లోకేష్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత కిలారు రాజేష్ కీలకంగా వ్యవహరించారు.2019లో పార్టీ ఓడిపోయిన తర్వాత రాజేష్ మరింత పట్టుదలతో పనిచేయడం మొదలు పెట్టారు. చంద్రబాబు జైలుకు వెళ్లడం తో లోకేష్ మీద ఒత్తిడి పెరిగిపోయింది.. ఈ నేపథ్యంలో నారా లోకేష్ కు అండగా నిలబడ్డారు రాజేష్. పార్టీ పెద్దలతో మంతనాలు జరిపారు. ఏపీలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు నారా లోకేష్ కు వివరించారు. వైసిపి చేస్తున్న కుట్రలను ఎప్పటికప్పుడు ఎండగట్టారు. తెర ముందుకు రాకపోయినప్పటికీ.. తెర వెనుక ఎంత చేయాలో అంతచేశారు రాజేష్. నారా లోకేష్ యువ గళం పేరుతో చేసిన పాదయాత్రకు కర్త కర్మ క్రియ రాజేష్ అంటే అతడి స్థాయి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. 3000 కిలోమీటర్ల పాటు లోకేష్ పాదయాత్ర జరిగితే.. ప్రారంభం నుంచి చివరి వరకు రాజేష్ ఆయన వెంట ఉన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడంలో.. ప్రజలకు నారా లోకేష్ ను మరింత చేరువ చేయడంలో రాజేష్ కీలక పాత్ర పోషించారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ రాజేష్ ఎటువంటి పదవిని కోరుకోలేదు. అధికారంలో లేనప్పుడు ఎలా అయితే ఉన్నారో.. ఇప్పుడు కూడా అలానే ఉన్నారు.అతడి నిరాడంబరతను గుర్తించిన పార్టీ సుప్రీమ్ చంద్రబాబు నాయుడు.. జనరల్ సెక్రటరీ పదవితో అతడి సేవలను గుర్తించారు.. రాజేష్ డౌన్ టు ఎర్త్ లాగానే ఉన్నారు. నారా లోకేష్ కు నమ్మిన బంటు లాగానే సాగుతున్నారు..విలువలు పాటించే వారికి పదవి అవసరం లేదు. పార్టీ మాత్రమే ముఖ్యం అనుకునే వారికి ఎటువంటి హోదా అవసరం లేదు. కొంతమంది ముందు గౌరవం కూడా తగ్గిపోతుంది. పదవి కూడా తన స్థాయి తగ్గించుకుంటుంది. ఎందుకంటే మహోన్నతమైన వ్యక్తిత్వం ముందు మిగతావన్నీ చిన్న ఇసుక రేణువుల మాదిరి లాంటివే కదా.. ఈ ఉపమానం నూటికి నూరు శాతం కాదు కోటి శాతం కిలారు రాజేష్ కు వర్తిస్తుంది.



# స్పోర్ట్స్ న్యూస్

## అందుకే పీఎస్ఎల్‌లో ఆడుతున్నా: ఇంగ్లండ్ స్టార్ బౌలర్

ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన లీగ్స్‌లో ఐపీఎల్ ఒకటి. అలాంటి క్యాచ్ రిచ్ లీగ్ కు వివిధ కారణాలతో కొందరు ప్లేయర్లు దూరంగా ఉంటుంటారు. ఇంగ్లండ్ మాజీ ఆల్‌రౌండర్ మొయిన్ అలీ కూడా ఆ జాబితాలో చేరాడు. ఈ ఏడాది ఐపీఎల్ 2026 సీజన్‌కు అతడు దూరంగా ఉండి.. పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో చేరాడు. అక్కడకరాచీ కింగ్స్ జట్టు తరఫున ఆడుతున్నాడు. ఈ క్రమంలో అతడిపై అనేక విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో మొయిన్ అలీ తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొని.. తాను ఐపీఎల్‌ను కాదని పీఎస్ఎల్ ఆడటం వెనుక ఉన్న అసలు కారణాలను వెల్లడించాడు.'నాకిప్పుడు 38 ఏళ్లు. అయినప్పటికీ నేనింకా క్రికెట్ ఆడాలనే అనుకుంటున్నాను. వీలైనంతగా నా కెరీర్‌ను పొడిగించుకోవాలని భావిస్తున్నాను. నేను పాకిస్థాన్ సూపర్ లీగ్ ఎంచుకోవడానికి కొన్ని బలమైన కారణాలు ఉన్నాయి. ఐపీఎల్ సుదీర్ఘంగా సాగుతోంది. అదే పీఎస్ఎల్ తక్కువ రోజుల్లో ముగిసే టోర్నీ. ఇది నా కుటుంబంతో గడపడానికి, అలాగే నా ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి బాగా ఉపయోగ పడుతుంది. పీఎస్ఎల్ షెడ్యూల్ నాకు సరిగ్గా సరిపోతుంది" అని అన్నాడు.'గతేడాది నేను ఐపీఎల్‌లో ఆడాను. అయితే సగం మ్యాచ్‌లలో కూడా బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. రెండుసార్లు మాత్రం నేను బ్యాటింగ్ చేసి ఉంటాను. నిజానికి నాకు బ్యాటింగ్ చేయడం ఇష్టం. నా కెరీర్ చివరి దశలోనూ ఎక్కువగా బ్యాటింగ్ చేయాలని కోరుకుంటున్నా. అయితే, ఆటను వీలైనంతగా ఆస్వాదించాలని భావిస్తున్నా. ఒక్కసారైనా పీఎస్ఎల్ ఆడాలని అనుకున్నా. కానీ.. దురదృష్టవశాత్తూ ఐపీఎల్‌తో పీఎస్ఎల్ షెడ్యూల్? క్లాష్ అవుతోంది. అందుకే ఈ సారి ఐపీఎల్‌కు దూరమయ్యాను" అని మొయిన్ అలీ తెలిపాడు.



## బౌలింగ్ మార్కర్‌ను విసిరేశాడు.. తీవ్ర వత్తిడిలో బుమ్రా..



ముంబై: ముంబై ఇండియన్స్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ సీజన్‌లో ముంబై జట్టు వరుస ఓటములు ఎదుర్కుంటోంది. ఇప్పటి వరకు బుమ్రా ఈ సీజన్‌లో ఒక్క వికెట్ కూడా తన ఖాతాలో వేసుకోలేదు. అయితే ఆ ఫ్రస్టేషన్ బుమ్రాలో కనిపించింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను తీవ్ర వత్తిడిలో ఉన్నట్లు తెలిసిపోయింది. ఓ దశలో బౌలింగ్ మార్కర్‌ను బుమ్రా విసిరేశాడు. ఆవేశాన్ని తట్టుకోలేక బౌలింగ్ మార్కర్‌ను విసిరేసినట్లు ఆ వీడియో ద్వారా అర్థమవుతోంది. ఈ ఘటనకు చెందిన ఓ ప్రైవేటు వీడియో రిలీజైంది. బౌలింగ్ మార్కర్‌ను విసిరేసి చాలా ఆగ్రహంగా అరిచినట్లు కూడా ఆ వీడియోలో ఉన్నది. అలాగే గ్రౌండ్‌లోనే ఉన్న మరో మార్కర్‌ను కూడా తన కాళ్లతో గట్టిగా తన్నాడు.బుమ్రా తీవ్ర అసహనంతో ఉన్న సమయంలో.. క్రీజ్‌లో టిమ్ డేవిడ్ బ్యాటింగ్ చేస్తున్నట్లు ఆ వీడియోలో కనిపించింది. ఆ మ్యాచ్‌లో ఆర్సీబీ 240 రన్స్ చేయగా, ముంబై కేవలం 222 రన్స్ మాత్రమే చేసి ఓటమిపాలైంది. అయితే ఆ మ్యాచ్‌లో బుమ్రా తన 4 ఓవర్లలో 35 రన్స్ ఇచ్చాడు. కానీ వికెట్ తీయలేకపోయాడు. బుమ్రా తాను ఆడిన 5 మ్యాచుల్లో ఒక్క వికెట్ కూడా తీయకపోవడం వల్ల ఫ్రస్టేషన్‌కు గురై ఉంటాడని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు. బౌలింగ్ మార్కర్‌ను విసిరేసిన బుమ్రాపై ఐపీఎల్ ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

## నటి తాన్యాపై పరువు నష్టం దావా వేసిన చాహల్.. ఎందుకంటే?

బాలీవుడ్ నటి తాన్యా ఛటర్జీపై టీమిండియా స్టార్ క్రికెటర్ యుజ్వేంద్ర చాహల్ పరువు నష్టం దావా వేశాడు. చాహల్ తనకు ఇన్‌స్టాలో ప్రైవేట్‌గా మెసేజ్‌లు పంపిస్తున్నాడంటూ తాన్యా ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. 'క్యూట్‌గా ఉన్నావ్' అంటూ చాహల్ తనకు నేరుగా మెసేజ్ చేసినట్లు స్క్రీన్ షాట్‌ను ఆమె మీడియాకు చూపించింది. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అయింది. ఈ నేపథ్యంలోనే తాన్యాపై చాహల్ పరువు నష్టం దావా వేసినట్టు తెలుస్తోంది.తాన్యా ఆరోపణల తర్వాత చాహల్‌పై నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. దీంతో అతడి పీఆర్ టీమ్ ఆ వీడియోను సోషల్ మీడియా నుంచి తొలగించాలని కోరినట్టు తాన్యా పేర్కొంది. ఈ విషయంపై తాజాగా తాన్యా స్పందించింది. మెసేజ్ చేసిన చాహల్‌ను ఎవరూ ప్రశ్నించట్లేరని.. తనపై మాత్రమే ట్రోల్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది.'ఈ విషయం ఇంత వైరల్ అవుతుందని నాకు తెలియదు. నన్నే ఎక్కువగా ట్రోల్ చేస్తున్నారు. పరువు పోయింది నాది. కానీ దానికి వ్యతిరేకంగా నా మీదే పరువు నష్టం దావా వేశారు. ఎందుకు యుజ్వేంద్ర చాహల్‌ను ఎవరూ ప్రశ్నించట్లేదు. నేను అతని వ్యక్తిత్వాన్ని తప్పు పట్టాలని అనుకోలేదు. నాకు చాహల్‌పై ఎంతో గౌరవం ఉంది' అని తాన్యా వెల్లడించింది.



## ఐపీఎల్ 2026: టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఢిల్లీ



బెంగళూరు: ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో భాగంగా చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగు మ్యాచుల్లో గెలిచి టేబుల్‌లో రెండో స్థానంలో ఉన్న ఆర్సిబి.. ఈ మ్యాచ్‌లో గెలిచి టేబుల్ టాప్‌లోకి వెళ్లేందుకు ఆశపడుతోంది. మరోవైపు వరుసగా రెండు ఓటములను చవిచూసిన ఢిల్లీ ఈ మ్యాచ్‌లో గెలవాలని భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్లు గత మ్యాచ్‌లోని జట్టు సభ్యులతోనే బరిలోకి దిగుతున్నాయి. విరాట్ కోహ్లీ, ఫిలిప్ సాల్ట్, దేవ్‌దత్ పడిక్కల్, రజత్ పాటిదర్ (కెప్టెన్), జితేశ్ శర్మ (కీపర్), టిమ్ డేవిడ్, రోమిరియో షెఫర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, సుయాష్ శర్మ, జోష్ హేజిల్‌వుడ్. డిసి: పాతుమ్ నిస్సాంక, కెఎల్ రాహుల్(కీపర్), సమీర్ రిజ్వి, అక్షర్ పటేల్(కెప్టెన్), డేవిడ్ మిల్లర్, ట్రిస్టన్ స్టబ్స్, ఆకిబ్ నబీ దార్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, టి నటరాజన్, ముఖేశ్ కుమార్.

## ఐపీఎల్ 2026: ఆర్సీబీతో పోరు.. టాస్ నెగ్గిన ఢిల్లీ క్యాపిటల్స్

ఐపీఎల్ 2026లో భాగంగా వీకెండ్ స్పెషల్ డబుల్ ధమాకా ఉండబోతోంది. నేడు రెండు మ్యాచ్‌లు జరగనున్నాయి. ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ జట్లు తలపడనున్నాయి. టాస్ నెగ్గిన ఢిల్లీ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత ఆర్సీబీ బ్యాటింగ్ చేయనుంది. గో గ్రీన్ కార్యక్రమంలో భాగంగా నేడు ఆర్సీబీ ప్లేయర్లు గ్రీన్ జెర్సీలతో బరిలోకి దిగనున్నారు. ఇప్పటికే ఆడిన ఐదు మ్యాచుల్లో నాలుగు గెలిచిన ఆర్సీబీ.. పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది. మరోవైపు ఆడిన నాలుగింట్లో రెండు మ్యాచులు గెలిచిన ఢిల్లీ.. ఆరో స్థానంలో ఉంది. నేటి మ్యాచ్‌లో ఆధిపత్యం ఎవరిదో చూడాల్సి ఉంది.విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్, దేవదత్ పడిక్కల్, రజత్ పాటీదార్(కెప్టెన్), జితేశ్ శర్మ(వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, రొమారియో షెఫర్డ్, కృనాల్ పాండ్య, భువనేశ్వర్ కుమార్, సుయాశ్ శర్మ, హేజిల్‌వుడ్ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: రసిక్ సలామ్ దార్, వెంకటేశ్ అయ్యర్, జోర్డాన్ కాక్స్, మంగేశ్ యాదవ్, విక్కీపాతుమ్ నిశాంక, కేఎల్ రాహుల్(వికెట్ కీపర్), సమీర్ రిజ్వీ, అక్షర్ పటేల్(కెప్టెన్), డేవిడ్ మిల్లర్, స్టబ్స్, ఆకిబ్ నబి దార్, లుంగి ఎంగిడి, కుల్దీప్ యాదవ్, టి నటరాజన్, ముకేశ్ కుమార్ఇంపాక్ట్ సబ్‌స్టిట్యూట్స్: విప్‌రాజ్ నిగమ్, అశుతోశ్ శర్మ, కరుణ్ నాయర్, దుశ్మంత్ చమీరా, నితీశ్ రాణా



## 'సర్పంచ్'కి అర్థం తెలియక అయోమయంగా అనిపించేది: శ్రేయస్ అయ్యర్

ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ జట్టు అజేయంగా దూసుకెళుతోంది. ఆడిన అన్ని మ్యాచుల్లోనూ గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను అభిమానులు, సహచర ఆటగాళ్లు 'సర్పంచ్ సాబ్' అంటూ పిలుస్తారన్న విషయం తెలిసిందే. పంజాబ్ కింగ్స్ జట్టులో చేరిన తర్వాతే అయ్యర్‌కు ఈ నిక్‌నేమ్ పెట్టారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రేయస్ ఆ ట్యాగ్ గురించి వివరించాడు. మొదట్లో సర్పంచ్‌కు అర్థం తెలియక అయోమయంగా అనిపంచేదని, మీనింగ్ తెలుసుకున్న తర్వాత స్పష్టత వచ్చిందని తెలిపాడు.'నాకు 'సర్పంచ్' అనే పదం బాగా నచ్చింది. పంజాబ్ కింగ్స్‌తో ప్రయాణం మొదలైనప్పుడు ఇలా ఎందుకు పిలిచారో కూడా తెలియదు. గందరగోళంగా అనిపించేది. అప్పుడే సహచరులను అడిగా. సర్పంచ్ అంటే ఏంటో వారు వివరించారు. కుటుంబం, ఒక గ్రూప్, లేదా ఊరు.. ఇలాంటి వాటికి పెద్దగా వ్యవహరించేవారినే సర్పంచ్ అంటారని తెలిసింది. అప్పటినుంచి 'సర్పంచ్' నా ప్రయాణంలో భాగమైంది. నాకెంతో ఇష్టమైన నిక్‌నేమ్‌గా మారిపోయింది' అని శ్రేయస్ అయ్యర్ వెల్లడించాడు.గతేడాది పంజాబ్ కింగ్స్ సారథిగా వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఆ జట్టును ఫైనల్‌కు చేర్చిన సంగతి తెలిసిందే. ఈ సీజన్‌లో అయ్యర్ అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. నాలుగు ఇన్నింగ్స్‌లలో 203 పరుగులు చేశాడు. అతని బ్యాటింగ్‌లో 14 సిక్సులు, 14 ఫోర్లు ఉన్నాయి.



## ఔటయ్యాననే కోపంతో షాహీన్ అఫ్రిది చేసిన పనికి అందరూ షాక్!

పాకిస్థాన్ సూపర్ లీగ్2026లో లాహోర్ ఖలందర్స్ కెప్టెన్ షాహీన్ షా అఫ్రిది చేసిన పని అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. అతడు ఏదో చేద్దామని భావించి.. ముందుగా బ్యాటింగ్ వచ్చి డకౌట్ అయ్యాడు. దీంతో పరువు పోయిందని భావించిన అఫ్రిది సహనం కోల్పోయి.. బ్యాట్‌తో బౌండరీ లైన్ వద్ద ఉన్న టైర్లను బలంగా కొట్టాడు. ఈ ఘటన ప్రస్తుతం పీఎస్ఎల్‌లో చర్చనీయాంశంగా మారింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం...పీఎస్ఎల్ 2026 భాగంగా క్వెట్టా గ్లాడియేటర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో లాహోర్ ఖలందర్స్ ఓటమి పాలైంది. షాహీన్ షా అఫ్రిది కెప్టెన్‌గా ఉన్న ఈ జట్టుకు ఇది నాలుగో ఓటమి కావడం గమనార్హం. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన లాహోర్ 19.5 ఓవర్లలో 134 పరుగులకే ఆలౌటైంది. లాహోర్ ఇన్నింగ్స్‌లో హసీబుల్లా ఖాన్( 33) మినహా మిగితా బ్యాటర్లందరూ విఫలమయ్యారు. అయితే ఈ మ్యాచ్‌లో షాహీన్ షా అఫ్రిది తన సహనాన్ని కోల్పోయాడు. క్వెట్టా గ్లాడియేటర్స్ బౌలర్ల ధాటికి 60 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ సమయంలో జట్టును గట్టెక్కించేందుకు అఫ్రిది తనను తానుగా ప్రమోట్ చేసుకుని ముందుగా బ్యాటింగ్‌కు వచ్చాడు.స్టార్ ఆల్ రౌండర్లు సికిందర్ రజా, డానియల్ సామ్స్‌ను కాదని అఫ్రిది ముందుగా బ్యాటింగ్ రావడం అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. అయితే షాహీన్ తాను ఆడిన తొలి బంతికే స్పిన్నర్ ఉస్మాన్ తారిక్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో గోల్డెన్ డకౌటైన బాధలో షాహీన్ అసహనానికి గురయ్యాడు. డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లే క్రమంలో బౌండరీ లైన్ దగ్గర ఉన్న టైర్లను బ్యాట్‌తో బలంగా బాదాడు. అంతేకాకుండా మెట్లకు కూడా తన బ్యాట్‌ను బలంగా కొడుతూ ముందుకు వెళ్లాడు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి. ఏదో పెద్ద ఘనతను చేజార్చుకున్నట్లుగా ఇంత ఓవరాక్షన్ ఎందుకంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు.





# సినిమా



## వెంకీతో త్రివిక్రమ్.. రైల్వేస్టేషన్ లో ప్లాన్ ఏంటి?



విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్.. ఈ ఇద్దరి కాంబినేషన్ అంటేనే ఒక వింటేజ్ వైబ్ గుర్తొస్తుంది. నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి సినిమాలకి త్రివిక్రమ్ రాసిన మాటలు వెంకీ టైమింగ్‌లో ఎలా పేలాయో మనందరికీ తెలుసు. అయితే ఈసారి కేవలం రైటర్ గానే కాకుండా, వెంకటేష్ 77వ సినిమాకి త్రివిక్రమ్ డైరెక్షన్ కూడా చేస్తుండటంతో అసలు మ్యాటర్ నెక్స్ట్ లెవల్‌కి వెళ్ళింది. లేటెస్ట్ గా 'ఆదర్శ కుటుంబం' ఒఐ47 షూటింగ్ సెట్స్ నుంచి వచ్చిన ఒక ఫోటో ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతోంది. ఈ లేటెస్ట్ అప్‌డేట్‌లో ఒక రైల్వేస్టేషన్ సెట్ కనిపిస్తోంది. పక్కనే ట్రైన్ ఉండగా, వెంకీతో త్రివిక్రమ్ ఏదో సీరియస్ గా ముచ్చట్లు పెడుతున్నట్లు ఆ ఫోటోలో ఉంది. ఇది చూస్తుంటే, సినిమాలో రైల్వేస్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో ఏదో ఒక ఇంట్రెస్టింగ్ సీన్ ఉండబోతోందని అర్థమవుతోంది. త్రివిక్రమ్ సినిమాలో స్టేషన్ సీన్లు అంటేనే ఒక వేల్యూ ఉంటుంది. మరి వెంకీతో ఆయన ఏ రకమైన మ్యాజిక్ ప్లాన్ చేస్తున్నారో చూడాలి. చాలా కాలం తర్వాత త్రివిక్రమ్ మళ్ళీ తన మార్కు ప్యూర్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఫోకస్ పెట్టారు. 'ఆదర్శ కుటుంబం' అనే పేరు వింటేనే, ఇది పక్కా మధ్యతరగతి ఇంటి కథ అని, అందులో త్రివిక్రమ్ మార్క్ పంచులు, వెంకటేష్ మార్క్ అల్లరి ఉండబోతున్నాయని క్లారిటీ వస్తోంది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్‌ను థియేటర్లకు రప్పించడంలో వెంకీ తర్వాతే ఎవరైనా. ఇక త్రివిక్రమ్ కాంటెంట్ క్లిక్కయితే బాక్సాఫీస్ వద్ద పాత రికార్డులు బద్దలవ్వడం ఖాయం. ఈ సినిమాలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, హారిక అండ్ హాసిని బ్యానర్‌పై రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ రైల్వేస్టేషన్ ఫోటోతో సినిమా మూడ్ ఏంటో చెప్పకనే చెప్పేశారు. గతంలో త్రివిక్రమ్ రాసిన సినిమాల్లో వెంకీ తన నటనతో ఒక రేంజ్ క్రేజ్ సంపాదించుకున్నారు. ఇప్పుడు ఏకంగా త్రివిక్రమ్ డైరెక్షన్‌లోనే పనిచేస్తుండటంతో, మనందరికీ నచ్చిన ఆ 'ఓల్డ్ వెంకీ మామ' మళ్ళీ స్క్రీన్ పై కనిపిస్తాడని ఫ్యాన్స్ వెయిట్ చేస్తున్నారు. రైల్వేస్టేషన్ సెట్‌లో జరుగుతున్న ఈ షెడ్యూల్ సినిమాకి చాలా కీలకం అని టాక్. త్రివిక్రమ్ సాధారణంగా సెట్స్‌లో చాలా కూల్‌గా ఉంటూ సీన్లను డెవలప్ చేస్తుంటారు. ఈ ఫోటోలో కూడా ఆ క్రియేటివ్ వైబ్ కనిపిస్తోంది. పర్ఫెక్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్న ఆడియన్స్‌కి ఈ 'ఆదర్శ కుటుంబం' ఒక మంచి ట్రీట్ అయ్యేలా ఉంది. ఇక మొదటి టీజర్ ఎప్పుడు వస్తుందో చూడాలి. సినిమాను అయితే ఇదే ఏడాది సమ్మర్ తరువాత విడుదల చేయాలని అనుకుంటున్నారు.

## సమంత కెరీర్ గ్రాఫ్..గ్యాప్!

ఏ మాయ చేసావే అంటూ అడుగుపెట్టిన సమంత అనతి కాలంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ ఆరంభంలో అమ్మడి ప్రయాణం ఒక ప్రభంజనంలా సాగింది. మహేష్ , పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస విజయాలు సాధిస్తూ సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికలలో ఒకరిగా సత్తా చాటారు. ఆ సమయంలో ఆమె కెరీర్ గ్రాఫ్ నిరంతరం ఎదుగుతూనే ఉంది. అయితే వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు సమంత వృత్తిపరమైన వేగాన్ని ప్రభావితం చేసాయి అన్నది కాదనలేని నిజం. మజిలీ, ఓ బేబీ వంటి చిత్రాలతో నటనలోని వైవిధ్యాన్ని నిరూపించు కున్నారు. కానీ వైవాహిక జీవితంలో విడిపోవడం , ఆ తర్వాతి కాలంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు ఆమెను సినిమాలకు కొంతకాలం దూరం చేశాయి. మయోసైటిస్ వ్యాధి వల్ల శారీరకంగా, మానసిక సిద్ధంగా బలపడటానికి ఆమె కావాలనే సినిమాలకు సుదీర్ఘ విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత సమంత కేవలం వెండితెరకే పరిమితం కాకుండా డిజిటల్ మాధ్యమంపై దృష్టి సారించారు. ది ఫ్యామిలీ మ్యాన్ 2 సిరీస్‌తో జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న అమ్మడు అటుపై తన కెరీర్ పంథాను మార్చుకున్నారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, కథా బలమున్న లేడీ ఓరియెంటెడ్ చిత్రాలను ఎంచుకోవడం మొదలుపెట్టారు. యశోద, శాకుంతలం వంటి ప్రయత్నాలు ఆ కోవలోకి చెందినవే అయినా అవి ఆశించిన స్థాయిలో బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేకపోయాయి. గత మూడేళ్ల కాలంలో సమంత కెరీర్ గ్రాఫ్‌లో స్పష్టమైన గ్యాప్ కనిపిస్తోంది. ఆమె తన సొంత నిర్మాణ సంస్థ ట్రాలాల మూవింగ్ పిక్చర్స్ ప్రారంభించి 'మా ఇంటి బంగారం' వంటి సినిమా ఇంకా షూటింగ్ దశలోనే ఉంది. ప్రస్తుతం సమంత ఎంపిక చేసిన ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. సమంత తన వ్యక్తిగత జీవితానికి , వృత్తికి మధ్య



సమతుల్యత సాధించే క్రమంలోనే ఈ స్థాయిలో గ్యాప్ తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమె వ్యక్తిగత జీవితం మళ్లీ స్థిరపడినట్లు కనిపిస్తున్నా? సినీ కెరీర్ విషయంలో మాత్రం ఆమె ఇంకా పాత వైభవం కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఒకప్పుడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే స్థాయి నుండి ఇప్పుడు ఒక్క సినిమా విడుదల కోసం అభిమానులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది.ప్రస్తుతం సమంత సెకండ్ ఇన్నింగ్స్‌లో క్వాంటిటీ కంటే క్వాలిటీ కే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె నిర్ణయాలు చెబుతున్నాయి. సామా ఆరంభంలో కమర్షియల్ స్టార్‌గా వెలిగిపోయారు. కానీ నేడు ఒక పరిణతి చెందిన నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక మార్గాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ గ్యాప్ తర్వాత ఆమె చేసే సినిమాలు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా ? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. కెరీర్ సెకండ్ హాఫ్‌లో ఆమె తీసుకోబోయే నిర్ణయాలే భవిష్యత్తులో ఆమె స్థానాన్ని డిసైడ్ చేస్తాయన్నది కాదనలేని నిజం.

## హ్యారీస్ జైరాజ్ మార్క్ ఎక్కడా కనిపించడం లేదే!



ఒకప్పుడు దక్షిణాది చిత్ర పరిశ్రమలో హ్యారీస్ జైరాజ్ పేరు ఒక సంచలనం. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్ వంటి దిగ్గజాల తర్వాత ఆ స్థాయి మెలోడీలను, ట్రెండీ మ్యూజిక్‌ను అందించగల సత్తా ఉన్న ఏకైక సంగీత దర్శకుడిగా హ్యారీస్ గుర్తింపు పొందారు. వాసు, ఘర్షణ, ఆరెంజ్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఓ ఊపు ఊపిన హ్యారీస్ తనకంటూ ఓ ప్రత్యేకమైన శైలిని సృష్టించుకున్నారు. కానీ గత కొంతకాలంగా ఆ మార్క్ బాక్సాఫీస్ వద్ద గానీ, చార్ట్‌బస్టర్లలో గానీ ఎక్కడా కనిపించకపోవడం సంగీత ప్రియులను విస్మయానికి గురిచేస్తోంది. హ్యారీస్ జైరాజ్ సంగీతంలో వైవిధ్యం కంటే ఒకే రకమైన సౌండింగ్ వినిపిస్తోందనే విమర్శలు ఆయన మార్కెట్‌ను దెబ్బతీశాయి. ఒకప్పుడు ప్రతి పాటలోనూ కొత్తదనం చూపించిన ఆయన క్రమంగా తన పాత ట్యూన్లనే రీసైకిల్ చేస్తున్నారనే భావన శ్రోతలలో కలిగింది. దీనికి తోడు ప్రస్తుతం మ్యూజిక్ ఇండస్ట్రీలో ఎలక్ట్రానిక్ డ్యాన్స్ మ్యూజిక్ ,భారీ మాస్ బీట్స్ ట్రెండ్ నడుస్తోంది. హ్యారీస్ బలం మెలోడీ కావడం, ప్రస్తుత కమర్షియల్ సినిమాలకు కావలసిన ఇన్‌స్టంట్ ఎనర్జీని ఆయన అందించలేకపోవడం వల్ల వెనుక బడ్డారా? అన్న సందేహాలు లేకపోలేదు. ఒకప్పుడు సూర్య, విక్రమ్, హ్యారీస్ జైరాజ్ కాంబినేషన్ అంటే కనీసం ఆరు నెలల ముందు నుండే పాటల కోసం అభిమానులు వేచి చూసేవారు. కానీ ఇప్పుడు స్టార్ హీరోల దృష్టి అంతా అనిరుధ్ రవిచందర్ , థమన్ వంటి యువ సంగీత దర్శకులపై పడింది. బిగ్ బడ్జెట్ సినిమాలు, పాన్ ఇండియా ప్రాజెక్టులు హ్యారీస్ చేతి నుండి జారిపోవడంతో ఆయన మార్కెట్ పైనా ప్రభావం చూపిస్తోంది . స్టార్ హీరోలతో నిరంతరం పని చేసిన ఆయన ఇప్పుడు యువ హీరోల సినిమాలకే పరిమితం కావాల్సి రావడం గమనార్హం. మారిన సాంకేతికతను , ప్రేక్షకుల అభిరుచులను అందిపుచ్చుకోవడంలో హ్యారీస్ కొంత నెమ్మదించారని విమర్శలు లేకపోలేదు. అనిరుధ్ వంటి వారు సోషల్ మీడియా ట్రెండ్స్‌కు తగ్గట్లుగా సాంగ్స్ కంపోజ్ చేస్తుంటే, హ్యారీస్ ఇంకా పాత పద్ధతులకే కట్టుబడి ఉండటం ఆయనకు మైనస్‌గా మారిందంటున్నారు. కేవలం ఒక వర్గం ప్రేక్షకులను మాత్రమే అలరించేలా ఆయన సంగీతం ఉండటం వల్ల, మాస్ ప్రేక్షకులకు ఆయన దూరమవుతున్నారన్నది కొందరి అభిప్రాయం. ఇది ఆయన కెరీర్ గ్రాఫ్‌ను అగ్రస్థానం నుండి కిందికి దించుతున్నట్లే ఉంది. అయినా హ్యారీస్ జైరాజ్ ప్రతిభను తక్కువ అంచనా వేయలేం. ఒక గొప్ప కంబ్యాక్ ఇవ్వడానికి ఆయనకు కావాల్సింది కేవలం ఒక సరైన దర్శకుడు, మంచి కథ మాత్రమే. గౌతమ్ మీనన్, శంకర్ లాంటి దర్శకులతో ఆయన పని చేసినప్పుడు వచ్చిన అవుట్‌పుట్ మళ్ళీ రిపీట్ అయితే? హ్యారీస్ మ్యాజిక్ మళ్ళీ మొదలయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆయన చేతిలో ఉన్న చిన్న సినిమాలు సంగీత పరంగా హిట్ అయితే? తిరిగి పెద్ద ప్రాజెక్టులు ఆయన తలుపు తట్టే అవకాశం లేకపోలేదు. సినీ పరిశ్రమలో మార్పు అనేది సహజం. నిన్న ఉన్న క్రేజ్ నేడు ఉండకపోవచ్చు. అయితే హ్యారీస్ జైరాజ్ వంటి అనుభవజ్ఞుడు తన శైలిని ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా మార్చుకుని మళ్ళీ తన మార్క్ మెలోడీలతో విరుచు కుపడితే తప్పకుండా పూర్వ వైభవాన్ని దక్కించుకోగలరు.



## కరుప్పుపై సడన్ ట్విస్ట్.. డైరెక్టర్ మాటలకు ఫ్యాన్స్ షాక్!

: సూర్య అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'కరుప్పు' సినిమా మే 14న విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు ఆర్‌జే బాలాజీ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి సంచలన విషయాలు పంచుకున్నారు. ఇది భక్తి సినిమా అని అందరూ అనుకున్నారు కానీ, నిజానికి ఇదొక మాస్ సూపర్ హీరో ఫిల్మ్ అని క్లారిటీ ఇచ్చారు. లోకంలో కష్టాలు పెరిగిపోయినప్పుడు, వాటిని అంతం చేయడానికి ఒక వీరుడు ఎలా వచ్చాడనే పాయింట్‌తో ఈ సినిమాను చాలా పవర్‌ఫుల్‌గా తెరకెక్కించారట. చాలా కాలంగా 'కరుప్పు' అంటే ఆర్‌జే బాలాజీ గత చిత్రం 'మూకుత్తి అమ్మన్' లాగే దైవత్వంతో కూడిన సినిమా అని అందరూ భావించారు. కానీ దర్శకుడు ఈ అంచనాలను తలకిందులు చేశారు. "ఇది భక్తి సినిమా కాదు, ఒక కష్టకాలంలో లోకాన్ని రక్షించడానికి వచ్చే సూపర్ హీరో కథ" అని ఆయన స్పష్టం చేశారు. కరుప్పసామి అనే పేరులో ఉన్న పవర్, ఆ క్యారెక్టరైజేషన్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం క్లాస్ ఆడియన్స్‌నే కాకుండా, బి, సి సెంటర్స్ లోని మాస్ ప్రేక్షకులను కూడా ఆకట్టుకునేలా భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో ఈ సినిమాను రూపొందించారు. సూర్య పవర్ ఫుల్ కమ్‌బ్యాక్: గతంలో వచ్చిన 'కంగువ', 'రెట్రో' వంటి సినిమాలు ఆశించిన స్థాయిలో సక్సెస్ కాకపోవడంతో, సూర్యకు ఈ సినిమా విజయం చాలా కీలకం. ఈ చిత్రంలో సూర్య పాత్ర ప్రయాణం చాలా ఎమోషనల్‌గా, అదే సమయంలో అత్యంత శక్తివంతంగా సాగుతుందట. ఒక సామాన్యుడు అసామాన్యుడిగా ఎలా ఎదిగాడు, సమాజంలోని చెడును ఎలా ఎదురించాడు అనే అంశాలను ఆర్‌జే బాలాజీ చాలా మాస్ స్టైల్‌లో ప్రెజెంట్ చేశారు. ఇక ప్రమోషన్స్‌లో వినిపిస్తున్న మాటలను బట్టి చూస్తే, సూర్య తన విశ్వరూపాన్ని ఈ సినిమాలో చూపించబోతున్నారని అర్థమవుతోంది. స్క్రీన్ ప్లే అద్భుతంగా ఉంటే బాక్సాఫీస్ షేకే!: సోషల్ మీడియాలో సూర్య ఫ్యాన్స్ ఈ అప్‌డేట్స్‌తో ఫుల్ ఖుషీగా ఉన్నారు.



సినిమా కాన్సెప్ట్ వినడానికి చాలా కొత్తగా ఉండటంతో, మంచి స్క్రీన్ ప్లే తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని వారు నమ్ముతున్నారు. ఇక ముఖ్యంగా కరుప్పసామి వంటి పవర్‌ఫుల్ టైటిల్ కనెక్టివిటీ వల్ల గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సినిమాకు భారీ ఆదరణ లభించే అవకాశం ఉంది. ఇప్పటికే రిలీజ్ అయిన టీజర్, ఇంటర్వ్యూలు సినిమాపై అంచనాలను ఆకాశానికి తీసుకెళ్లాయి. కేవలం ఫైట్లు మాత్రమే కాకుండా, కథలో ఉన్న గ్రిప్పింగ్ పాయింట్స్ అందరినీ ఆకట్టుకుంటాయని టాక్. మే 14న అసలైన వేట మొదలు: ఎన్ని ఆలస్యాలు జరిగినా 'కరుప్పు' క్రేజ్ మాత్రం తగ్గలేదు. ఆర్‌జే బాలాజీ విజన్, సూర్య నటన తోడైతే మే 14న థియేటర్లలో పూనకాలు రావడం ఖాయం.

Edited, Printed, Published and Owned by KASHAPAGA SAHITYA, and Printed at THANMAYEE PRINTERS, D.No. 17-2-539,Shop No.7&8,Saidabad,Hyderabad,Telangana and Published at: H.No. 18-7-731, Gowlipura, Chatrinaka, Hyderabad-500053, Telangana.Editor: KASHAPAGA SAHITYA. "RNI No.TELTEL/2015/64243. Cell:7671859219 E-mail Id: iyyalatelangana@gmail.com